# తొలివార్త
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com

ప్రచురణ : రంగారెడ్డి  ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్  సంపుటి : 02  సంచిక : 151  మంగళవారం  06 - 10 - 2026  వెల : 4/-  పేజిలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial



best deal
HEALTH & WEALTH
"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."
We create opportunities | 9640707117
(What's up only)


## తెలంగాణలో 'సర్' పేరుతో
# 90 లక్షల ఓట్లు తీసేశారు

- కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- 'సర్' ప్రక్రియలో అవకతవకలపై రెండు నెలల పాటు నిరసనలు
- ఈసీ తీరుకు వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తాం
- ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఒత్తిడితోనే ఈసీ వ్యవహరిస్తోందని ఆరోపణ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలి: రాహుల్ గాంధీ
- 6, 7 తేదీల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆందోళనలు
- 8న లోక్‌భవన్ ఎదుట భారీ నిరసనకు టీపీసీసీ పిలుపు



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 05 :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పేరుతో 90 లక్షల ఓట్లు తీసేశారని కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ప్రజాసంఘాలు, ఎన్జీవోలు, కుల సంఘాలకు, ఓట్లు గల్లంతైన వారి ఓట్లను పరిరక్షించుకునే విధంగా లేఖ రాస్తామని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన ఈరోజు (సోమవారం) ఢిల్లీలో కీలక సమావేశం జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో 'సర్' ప్రక్రియ అవకతవకలపై చర్చించామని తెలిపారు. రానున్న రెండు నెలల పాటు నిరంతర కార్యక్రమాలు నిర్వహించాలని చర్చించామని అన్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒత్తిడితోనే ఎన్నికల కమిషనర్ ఇలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. - మిగతా 2 లో

## కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక
# శాశ్వతంగా వన్‌వే




- జీహెచ్ఎంసీ కమిషనర్
- కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్‌ను శాశ్వతం చేసిన జీహెచ్ఎంసీ
- పాత ప్రాజెక్టులో మార్పులతో ప్రభుత్వానికి రూ.400 కోట్ల ఆదా
- నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కొత్త స్టీల్ ఫ్లైఓవర్
- ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం
- కేబీఆర్ పార్క్ వద్ద అండర్‌పాస్ కూడా నిర్మించనున్న అధికారులు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 05 :** హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ - మిగతా 2 లో



## ఒక్కో ఉద్యోగికి
# రూ.1,10,250 బోనస్

- సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బొనాంజా
- రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 05 :** దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు కేంద్రం బోనస్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఒక్కో ఉద్యోగికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, - మిగతా 2 లో

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి వరించిన
# నోబెల్ బహుమతి

- ఆప్టోజెనెటిక్స్‌పై పరిశోధనలకు 2026 వైద్యశాస్త్ర నోబెల్
- కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు పురస్కారం
- మెదడులోని నాడీకణాలు జ్ఞాపకాలు, భావాలు, ప్రవర్తనను ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకునేందుకు కీలక ముందడుగు



**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 05 :** కాంతి ద్వారా జీవకణాల్లోని అయాన్ ఛానెళ్లను నియంత్రించే పద్ధతులు, నాడి వ్యవస్థ కణాల పనితీరును అధ్యయనం చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు 2026 నోబెల్ వైద్యశాస్త్ర పురస్కారం దక్కింది. ఆప్టోజెనెటిక్స్ రంగంలో చేసిన పరిశోధనలకు గాను - మిగతా 2 లో

## భారత్ కీలక
# శక్తిగా ఎదుగుతోంది



- ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
- స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
- గ్లోబల్ గవర్నెన్స్, డిప్లొమాసీలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడి ప్రశంసలు
- 2027 లో జెనీవాలో నిర్వహించే గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్ భాగస్వామ్యాన్ని కోరిన గై పార్మిలిన్

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 05 :** అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం - మిగతా 2 లో

## భూమిపై భారీ ఉల్కాపాతం వయసు లెక్కింపు

- 10 కోట్ల సంవత్సరాలు తక్కువగా నిర్ధారణ
- ఒక్లహోమాలోని ఏమ్స్ ఉల్కాపాతం క్రేటర్ వయసుపై కొత్త పరిశోధన
- గత అంచనా కంటే 10 కోట్ల సంవత్సరాలు తక్కువ వయసు అని నిర్ధారణ
- గతంలో 46.7 కోట్లు ఏళ్లు కాగా, ఇప్పుడు 37 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడినట్లు గుర్తింపు
- జిర్కాన్ డేటింగ్ పద్ధతి ద్వారా శాస్త్రవేత్తల తాజా అంచనా
- భారీ జీవరాశుల వినాశనం జరిగిన కాలానికి దగ్గరగా ఈ సంఘటన



2 లో..

## బ్రెజిల్‌ను భారత్ అని
# పొరబడిన ట్రంప్

- సోషల్ మీడియాలో వింత పోస్ట్!
- బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలను భారత ఎన్నికలని పొరబడిన ట్రంప్
- భారత్‌లో 125 మిలియన్ల మంది ఓటేశారంటూ సోషల్ మీడియాలో పోస్ట్
- అమెరికా ఎన్నికల వ్యవస్థ అవినీతిమయమని విమర్శించే క్రమంలో ఈ వ్యాఖ్యలు
- అసలు ఎన్నికలు జరిగింది బ్రెజిల్‌లో అని సరిదిద్దిన నెటిజన్లు



**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 05 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన వ్యాఖ్యలతో - మిగతా 2 లో

## కనీసం వెయ్యి పాఠశాలలను
# 5-స్టార్ స్థాయికి అభివృద్ధి చేయాలి



- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్
- మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!
- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన
- ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల పాఠశాలలతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 05 :** ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేలా మంత్రి లోకేశ్ కీలక లక్ష్యాలు నిర్దేశించారు. 2029 నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ స్థాయికి, కనీసం వెయ్యి స్కూళ్లను 5-స్టార్ స్థాయికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఏజెన్సీ, వెనకబడిన ప్రాంతాల పాఠశాలలతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య - మిగతా 2 లో



## అంబటి రాంబాబుకు కిర్లంపూడి
# పోలీసుల నోటీసులు

- ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ
- ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి
- వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 05 :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో - మిగతా 2 లో

## ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా
# సురక్షిత తాగునీరు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో 'జల జీవన్ మిషన్ 2.0
- అమరజీవి జలధార' పథకానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు
- జల జీవన్ మిషన్ 2.0- అమరజీవి జలధార పథకానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 05 :** గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి జలహారతి ఇచ్చే బాధ్యత తమదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తామని, ప్రధాని మోదీతో ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో 'జల జీవన్ మిషన్ 2.0- అమరజీవి జలధార' పథకానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. "గోదావరి-కావేరి నదుల అనుసంధానం నా కోరిక. కరవు పరిస్థితుల్లో 200 టీఎంసీలు సముద్రంలోకి పోయాయి. గోదావరి-కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు. రానున్న రెండేళ్లలో రూ.30వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు తాగునీరు ఇస్తాం. గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి. వైఎస్సార్సీపీ హయాంలో రోడ్లు గుంతలమయం అయ్యాయి. పాలనలో పవన్‌కల్యాణ్ తనదైన ముద్ర వేస్తున్నారు. కరవు పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రచించాం. రాయలసీమ దశ, దిశ మార్చిన ప్రభుత్వం ఎన్డీయే. ఈ ప్రాంతానికి రెండేళ్లలో రూ.24 వేల కోట్లు ఖర్చు చేశాం. వైఎస్సార్సీపీ హయాంలో రాయలసీమకు - మిగతా 2 లో

# సంపాదకీయం

## 'ప్రాంప్ట్'లు ఉడకవ్!



చలం 'మైదానం' రాశాడు. 'బ్రాహ్మణీకం' రాశాడు. 'దైవమిచ్చిన భార్య' రాశాడు. పట్టని పాఠకులకు ఎలాగూ పట్టని ఎన్నో ఉత్తమోత్తమమైన రచనలు చేశాడు. ఆయన పుస్తకా లన్నీ ఫలానా ఏఐ సంస్థవారు ఏ ఆదివారం పూటో అబిడ్స్ సెకండ్ హ్యాండ్ పుస్తకాల కొట్లలోనో గాలించి, వాటన్నింటినీ హైస్పీడ్ స్కాన్ చేసి ఆనెక ఆ కాగితాలన్నింటినీ కుప్పబోసి కాల్చేశారనుకోండి. ఆ తర్వాత ఏం జరుగుతుందో మీకేమైనా తెలుసా? రావిశాస్త్రి గారున్నారు. పేదల నడ్డి మీద దుడ్డుకర్రలతో బాదే రక్కసి పెద్దల మీద, వాళ్లకు సపోర్టుగా దిగే ఖాకీవాలాల మీద, లూప్‌హోల్స్ అందించే నల్లకోటు కన్నింగ్ కోవిదుల మీద ఎన్నో చురకలు వేశాడు. చెమ్డాలు లెక్కదీశాడు. అట్టి రావిశాస్త్రి సమగ్ర రచనలన్నింటినీ పేజీ పేజీన పీల్చుకుని, నమిలి, అరాయించుకుని ఏఐగారు బ్రేవ్‌మని తేన్చారనుకోండి. ఆనెక ఏం జరుగుతుందో తెలుసా?విశ్వనాథ రాసిన వేయి రచనలు, బీనాదేవి బహుముఖీన కథలు, మధురాంతకం కథా మురబ్బాలు, అల్లం రాజయ్య పిడికెలెత్తిన పాత్రలు... ఇవన్నీ ఏఐ ఒంట పట్టించు కుంటే జరిగే వింత ఏమిటంటే రేప్పొద్దున ఏ ఇన్‌స్టా రచయితో 'రాజేశ్వరి పశ్చాత్తాపం' అనే నవల చలం శైలిలో రాయి అంటే రాస్తుంది. మరే రీల్స్ రైటరో 'రావిశాస్త్రి యాసలో సారా కాంట్రాక్టర్ల మానవత్వానికి దీపం పట్టు' అంటే ఒక రచన నుడువుతుంది. చాసోలా, చండీదాస్‌లా, బుచ్చిబాబులా రాయమని అడగ్గానే క్షణాల్లో వారి శైలిలోనే అక్షరాలను పరుస్తుంది. ఏఐ కిచెన్‌లో పోపు తగిలించుకునే ఫాస్ట్‌ఫుడ్ ఇది. ప్లేట్ మీద మన పేరు తగిలించుకుని మార్కెట్లోకి వరదలా వదలొచ్చు. బుర్రను వాడలేని, ఒరిజినల్‌గా రాయలేనివారు హోషియారీగా ప్రాంప్ట్ ఇవ్వడం నేర్చుకుని రచయితలుగా చలామణి అయిపోవచ్చు. ఇక పాఠకుల విషయానికి వస్తే బావి తెలియని వారికి కుళాయిలో వచ్చేవే నీరైనట్టు ఈ నకళ్లే ఒరిజినల్స్ అనుకునే ఖర్మ పట్టొచ్చు.ఇదొక నష్టమా? ఇంకా ఉంది... ఒక మనిషి ఏదో మేర బుర్ర కలిగి ఉండటమే గొప్ప. షేక్‌స్పియర్ బుర్ర, సోమర్‌సెట్‌మామ్ బుర్ర, హెమింగ్వే బుర్ర... ఇవి తోడొస్తే? యద్దనపూడి, యండమూరి, మల్లాది బుర్రలను మిక్సీలో వేసి భేషైన బుర్రను ఇస్తాం అని చెప్తే? కొమ్మూరి సాంబశివరావు, టెంపోరావు, మధుబాబుల కాంబినేషన్ బుర్ర రెడీగా ఉందంటే? ప్రస్తుత ఉచిత ఏఐ టూల్స్‌తోనే బోలెడంత కాపీ రచనలు చేసేస్తున్నారు మనవాళ్లు. ఇక 'క్లాసిక్ రచయితల రచనలను అరాయించుకున్నప్రీమియం ఏఐ టూల్‌ను ఇస్తాం... మీ ప్రాంప్ట్‌కు బ్రహ్మాండమైన రచన సరఫరాచేస్తాం... నెలకు 20 డాలర్లు' అనంటే కొనేవాళ్లు కొల్ల. కానీ ఒరిజినల్ రైటర్స్‌కు పైసా పోదు. ఏఐ కంపెనీకే పోతుంది. ఏఐ వద్ద ఏమీ లేదు. దానికి డేటా కావాలి. మేధో డేటా. బుర్రున్న డేటా. హృదయ మున్న డేటా. స్పందన ఉన్న డేటా. అది సాహిత్యం. గురజాడ నుంచి కేశవరెడ్డి వరకు ఉత్తమ రచయితల రచనలు ఫీడ్ అయ్యేకొద్దీ అది తర్ఫీదు అవుతూ ఉంటుంది. ఆ తర్ఫీదుతో తన మీద ఆధారపడే పరాన్నభుక్కు రచయితల ముఖాన కొన్ని పాప్‌కార్న్ పడేస్తుంటుంది. దానికి తెలుసు.... తన రచనలో నిజమైన గుండె మంట, లెంప పగుల గొట్టే వ్యంగ్యం, కనుచివర దాటని శోకం ఉండవని... ఉండలేవని. అందుకే అది తన వద్దకు రమ్మనదు. వచ్చినవారిని ఖాళీ చేతులతో పంపదు.ఇప్పుడేం చేయాలి? రచయితలు, పాఠకులు సమష్టిగా ఈ దశను ఎదుర్కొనాలి. రచయితలు ఏఐకి ఇంకా అందని జీవితాన్ని, ఏఐ పంటి కింద ఇప్పటికీ నలగని భాషలో రాయాలి. ఏఐతో కలిసి రాస్తున్న రచయితల బోలు రచనలను బద్దలు కొట్టే జీవనసాంద్రతలను రాయాలి. మనిషి కంటికీ చేతికీ మాత్రమే చిక్కే బతుకు చిత్తరువును చూపాలి. ఇక పాఠకులు స్క్రీన్ మీద కాకుండా చేతిలో పట్టుకునే పుస్తకాన్ని మాత్రమే చదవాలి. రీడర్స్ గ్రూపులుగా ఏర్పడి మంచి పుస్తకాల ఆనవాలు పట్టి అక్కున చేర్చుకోవాలి.

## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

**మొదటిపేజీ తరువాయి -** స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

## తెలంగాణలో 'సర్' పేరుతో 90 లక్షల ఓట్లు తీసేశారు

**మొదటిపేజీ తరువాయి -** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని రాహుల్ గాంధీ చెప్పారని అన్నారు. ఈ నెల 6,7వ తేదీల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని వెల్లడించారు. అక్టోబరు 8వ తేదీన లోక్‌భవన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్

**మొదటిపేజీ తరువాయి -** సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు.దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని కిషన్? రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణికి ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. సింగరేణి కార్మికులకు ముందస్తు దసరా, దీపావళి సుభాకాంక్షలను కిషన్? రెడ్డి తెలియజేశారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వతంగా వన్‌వే




**మొదటిపేజీ తరువాయి -** ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది.సోమవారం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్?ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు

**మొదటిపేజీ తరువాయి -** కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.వివేకా హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసిపోయింది. వివేకా హత్యపై జగన్ సమాధానం చెప్పాలి. మద్యం కుంభకోణంలోనూ అన్ని వేళ్లూ ఆయన వైపే చూపిస్తున్నాయి. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై జగన్ సమాధానం చెప్పాలి. ఉచిత ఇసుక ప్రజల హక్కు అక్రమాలు జరిగితే ఎవరినీ వదిలిపెట్టం" అని చంద్రబాబు హెచ్చరించారు."పల్లెపండుగ 3.0తో రూ.11,085 కోట్లతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు. రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు, పంటకుంటల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారానికి తీవ్రంగా కృషి చేస్తున్నాం. మదనపల్లెలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టాం. శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సహకారంతో 3 లక్షల ఇళ్లకు శ్రీకారం



చుట్టాం. మరో 6 లక్షల ఇళ్ల నిర్మాణానికి శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు. రూ.30,156 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులకు శ్రీకారం చుట్టాం. ప్రజలు మెచ్చే పరిపాలన చేస్తాం, అందరి ఆశలు నెరవేరుస్తాం. ప్రతి వ్యక్తికి ఇంటి జాగా ఉండాలి, సొంత అడ్రస్ ఉండాలి. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తాం. చదువు పూర్తికాగానే పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "కేంద్రంలో మోదీ సహకారం, పవన్ తపన, నా అనుభవ ంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం బుల్లెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. రాష్ట్ర పునర్ నిర్మాణానికి బలమైన పునాదులు వేశాం. పేదవాడి సాధికారత, నాణ్యమైన జీవితం వంటి కార్యక్ర మాలు చేపట్టాం. నాణ్యమైన మద్యాన్ని తక్కువ రేటుకే ఇస్తున్నాం. వాళ్లే నేరాలు ఘోరాలు చేసి ఎదుటివారిపై నెడతారు. నేను 2019లో ఉన్న ముఖ్యమంత్రిని కాదు, 4.0 వెర్షన్ ముఖ్యమంత్రిని. కుట్రలు, ఫేక్ ప్రచారాలే గొడ్డలి పార్టీ సిద్ధాంతం. నేరాలు చేయడం, ఇతరులపై నెట్టడం గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే ఉంది. రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులు చేయిస్తున్నారు. కడపకు ఏం చేశారో చెప్పే ధైర్యం వైఎస్సార్సీపీకి ఉందా? చెప్పండి అని చెప్పారు.

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

**మొదటిపేజీ తరువాయి - ౧**

మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు.గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు.భారత్- స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఫ్టా) మధ్య జరిగిన టెపా (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన ఇఫ్టా మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు.కేవలం ఎగుమతి, దిగుమతులపై సుంకాలను మాత్రమే తగ్గించే ఒప్పందం కాదని, దీర్ఘకాలిక పెట్టుబడులు, ఉపాధి, ఆవిష్కరణలు, స్థిరమైన ఆర్థిక వృద్ధికి ఇది పునాది వేస్తుందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడు వివరించారు. ఈ వాణిజ్య ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టెపా) కింద ఇఫ్టా దేశాలు భారత్‌లో 15 ఏళ్లలో ఏకంగా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్ని ప్రోత్సహించడం, ఇందులో భాగంగా సుమారు 10 లక్షల ఉద్యోగాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు మోదీ కూడా భారత్- ఇఫ్టా ఒప్పందాన్ని భారత్- స్విస్ ఆర్థిక సంబంధాల్లో కీలక ముందడుగుగా అభివర్ణించారు. గై పార్మెలిన్ అక్టోబర్ 5 నుంచి 7 వరకు భారత పర్యటనలో ఉండనున్నారు. రాష్ట్రపతి, ప్రధానితో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# వైద్యశాస్త్రంలో ముగ్గురికి వరించిన నోబెల్ బహుమతి

**మొదటిపేజీ తరువాయి -** అమెరికాకు చెందిన కార్ల్ డిసెరోత్, జర్మనీకి చెందిన పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌లను నోబెల్ కమిటీ సోమవారం విజేతలుగా ప్రకటించింది. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఆ ప్రకటన వెలువడింది.సింపుల్‌గా చెప్పాలంటే, కాంతిని ఉపయోగించి నాడీకణాల పనితీరును నియంత్రించే టెక్నిక్‌నే ఆప్టోజెనెటిక్స్ అంటారు. మన మెదడులో కోట్లాది నాడీకణాలు ఒకదానితో ఒకటి సంకేతాలను పంపించుకుంటూ పనిచేస్తుంటాయి. ఏ నాడీకణం ఏ పని చేస్తుంది? దాన్ని యాక్టివ్ చేస్తే ఏం జరుగుతుంది? దాన్ని ఆపితే ఏ మార్పు వస్తుంది? అనే విషయాలను తెలుసుకోవడం ఇంతకుముందు అంత సులభం కాదు. గతంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏ ప్రాంతం ఏ పనికి సంబంధించిందో గుర్తించేందుకు ప్రయత్నించారు. కానీ ఒక నిర్దిష్ట నాడీకణం కారణంగానే ఒక జ్ఞాపకం, భావన లేదా ప్రవర్తన ఏర్పడుతోందని కచ్చితంగా నిరూపించడం కష్టంగా ఉండేది. మెదడుకు ఒక మ్యాప్ వేసినట్టే సమాచారం ఉండేది. కానీ అందులో చాలా ప్రశ్నార్థకాలు ఉండేవి. ఆ పరిస్థితిని మార్చడంలో ముగ్గురి పరిశోధనలు కీలకంగా మారాయి.మొదటి కీలక అడుగు పీటర్ హెగెమన్ పరిశోధనలతో పడింది. జప్తశ్రీఖఎఎంశీఏశీఖుం అనే ఒకే కణం కలిగిన చిన్న ఆల్గీపై ఆయన ఆసక్తి చూపారు. ఆ జీవి కాంతి వైపు ఎలా కదులుతుందనే ప్రశ్న ఆయనను పరిశోధన వైపు నడిపించింది. ఆ తర్వాత జార్జ్ నగెల్‌తో కలిసి హెగెమన్ చేసిన పరిశోధనల్లో చానల్‌రోడాప్సిన్ అనే ప్రత్యేక ప్రొటీన్ గుర్తించారు. ఇది ఆ ఆల్గీ కణం ఉపరితలంలో ఉంటుంది. దానిపై నీలి కాంతి పడినప్పుడు ప్రొటీన్‌లోని ఒక మార్గం తెరుచుకుంటుంది. దీంతో విద్యుత్ ఛార్జ్ కలిగిన అయాన్లు కణంలోకి ప్రవేశిస్తాయి. ఫలితంగా విద్యుత్ సంకేతం ఏర్పడుతుంది. ఇక్కడే అసలు ఆసక్తికరమైన విషయం బయటపడింది. ఆ ప్రొటీన్‌ను వేరే కణాల్లోకి ప్రవేశపెట్టినా, ఆ కణాలను కాంతికి స్పందించేలా చేయవచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు.ఆ ఆవిష్కరణను నాడీకణాలపై ఉపయోగించే దిశగా కార్ల్ డిసెరోథ్ కీలక అడుగు వేశారు. ఎలుకల నాడీకణాల్లో చానల్‌రోడాప్సిన్ కోసం అవసరమైన జన్యువును ప్రవేశపెట్టారు. ఆ తర్వాత నీలి కాంతిని ఉపయోగించి ఆ నాడీకణాలను యాక్టివేట్ చేయగలిగారు. 2005లో ఆయన ఈ పరిశోధనను ప్రచురించారు. 2007లో మరో కీలక ముందడుగు వేశారు. జీవించి ఉన్న ఎలుక మెదడులోనే కాంతిని ఉపయోగించి నాడీకణాలను నియంత్రిం చగలిగారు. అక్కడి నుంచి ఆప్టోజెనెటిక్స్ ప్రపంచవ్యాప్తంగా న్యూరోసైన్స్ పరిశోధనల్లో కీలకమైన పద్ధతిగా మారింది.ఆ టెక్నిక్‌తో మెదడులోని నిర్దిష్ట నాడీకణాలను యాక్టివేట్ చేయడం లేదా వాటి కార్యకలాపాలను తగ్గించడం సాధ్యమైంది. దీంతో కొన్ని ప్రత్యేక జ్ఞాపకాలు, భావోద్వేగాలు, ప్రవర్తనల వెనుక పనిచేసే నాడీ సర్క్యూట్లను పరిశోధకులు మరింత స్పష్టంగా అధ్యయనం చేస్తున్నారు. ముఖ్యంగా నాడీ సంబంధిత, మానసిక సమస్యలకు సంబంధించిన మెదడు సర్క్యూట్లను అర్థం చేసుకోవడంలో ఇది ఉపయోగపడుతోంది. అంతేకాదు, చూపు కోల్పోయిన వారికి దృష్టిని తిరిగి అందించే ప్రయత్నాల్లోనూ ఆప్టోజెనెటిక్స్‌ను ఉపయోగించే పరిశోధనలు జరుగుతున్నాయి. నోబెల్ కమిటీ ప్రకారం, ఈ పద్ధతి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రయోగశాలల్లో మెదడు రహస్యాలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతోంది.కార్ల్ డిసెరోథ్ అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. పీటర్ హెగెమన్ జర్మనీలోని హంబోల్ట్ యూనివర్సిటీకి చెందినవారు. జార్జ్ నగెల్ కూడా జర్మనీలోని వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీలో పరిశోధనలు చేస్తున్నారు. ఆ ముగ్గురూ కలిసి అందుకున్న 2026 వైద్యశాస్త్ర నోబెల్ పురస్కారం నగదు 12 మిలియన్ స్వీడిష్ క్రోనర్. ఆ మొత్తాన్ని ముగ్గురూ సమానంగా పంచుకోనున్నారు. గతేడాది వైద్యశాస్త్ర నోబెల్ మానవ రోగ నిరోధక వ్యవస్థపై కీలక పరిశోధనలు చేసిన మేరీ ఈ. బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకగుచిలకు దక్కింది. ఇక 2026 నోబెల్ ప్రకటనల్లో భాగంగా మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య పురస్కారాలను ప్రకటించనున్నారు. శుక్రవారం శాంతి నోబెల్, అక్టోబర్ 12న ఆర్థికశాస్త్రంలో నోబెల్ విజేతలను వెల్లడించనున్నారు.

## కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి అభివృద్ధి చేయాలి

**మొదటిపేజీ తరువాయి -** శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో జీరో-స్టార్ పాఠశాలలన్నింటినీ వన్-స్టార్ స్థాయికి చేర్చాలని ఆదేశించారు. ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌కు అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 16 వందల 85 వన్-స్టార్, 15 వేల 618 టూ-స్టార్, 19 వేల 99 త్రీ-స్టార్, 7 వేల 172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నట్లు అధికారులు వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 లీప్ స్కూళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలల మౌలిక సదుపాయాల పురోగతికి డీఈఓలు, ఎంఈఓలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు.రాష్ట్రంలోని 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయి కంప్యూటర్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని లోకేశ్ ఆదేశించారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున ఇక అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించడంపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగ యువతీయువకుడిని స్కిల్ పోర్టల్‌లోకి తీసుకురావాలని లోకేశ్ ఆదేశించారు. ఏఐ ఆధారిత ఇంటర్వ్యూల ద్వారా వారి నైపుణ్యాలను గుర్తించి ఉద్యోగ అవకాశాలకు అనుసంధానం చేయాలని సూచించారు. సీడాప్, ఓంక్యాప్ ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ ఇప్పించి అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## బ్రెజిల్‌ను భారత్ అని పొరబడిన ట్రంప్

**మొదటిపేజీ తరువాయి -**

వార్తల్లో నిలిచారు. బ్రెజిల్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల గురించి మాట్లాడుతూ, ఆ దేశాన్ని పొరపాటున భారత్‌గా పేర్కొన్నారు. బ్రెజిల్‌లో తొలిదశ పోలింగ్ ముగిసిన వెంటనే, ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి."భారత అధ్యక్ష ఎన్నికల మొదటి రౌండ్‌లో ఈ రోజు 125 మిలియన్ల మంది ఓటు వేశారు. ఓటింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు ఫలితాలు వచ్చేశాయి! కానీ, అమెరికాలోని డెట్రాయిట్, ఫిలడెల్ఫియా, కాలిఫోర్నియా వంటి నగరాల్లో ఇంతకంటే తక్కువ సంఖ్యలో ఓట్లు ఉన్నా, ఫలితాలు లెక్కించడానికి వారాలు పడుతుంది. అమెరికాలో ఓటింగ్ వ్యవస్థ అవినీతిమయం!!!" అని ట్రంప్ తన పోస్టులో ఆరోపించారు. అయితే, భారత్‌లో ప్రజలు నేరుగా అధ్యక్షుడిని ఎన్నుకోరనే విషయాన్ని ఆయన గమనించలేదు. అధికారిక వైట్ హౌస్ రాపిడ్ రెస్పాన్స్ ఖాతా కూడా ట్రంప్ పోస్టును రీపోస్ట్ చేయడం గమనార్హం.ట్రంప్ పోస్ట్ చేసిన వెంటనే, వేలాది మంది సోషల్ మీడియా వినియోగదారులు కామెంట్ల విభాగంలో ఆయన పొరపాటును సరిదిద్దారు. ఎన్నికలు జరిగింది భారత్‌లో కాదని, బ్రెజిల్‌లో అని స్పష్టం చేశారు.తాజాగా బ్రెజిల్‌లో అధ్యక్ష ఎన్నికల తొలిదశ పోలింగ్ జరిగింది. ఇందులో రైట్-వింగ్ అభ్యర్థి ఫ్లేవియో బొల్సొనారో, ప్రస్తుత అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా కంటే స్వల్ప ఆధిక్యం కనబరిచారు. అయితే, గెలుపునకు అవసరమైన 50 శాతానికి పైగా ఓట్లను ఎవరూ సాధించలేకపోయారు. 98.81 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి, బొల్సొనారోకు 47.24 శాతం, లూలాకు 44.91 శాతం ఓట్లు లభించాయి. దీంతో ఇద్దరి మధ్య అక్టోబర్ 25న రన్-ఆఫ్ (రెండో దశ) ఎన్నికలు జరగనున్నాయి.గత ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు సైనిక కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలతో 27 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ అధ్యక్షుడు జైర్ బొల్సొనారో కుమారుడే ఈ ఫ్లేవియో బొల్సొనారో. తొలి రౌండ్‌లో ఫ్లేవియో మంచి ప్రదర్శన కనబరచడంతో, రెండో దశలో లూలాకు గట్టిపోటీ ఎదురుకానుంది. బ్రెజిల్ అధ్యక్ష పీఠాన్ని రైట్-వింగ్ శక్తులు చేజిక్కించుకోకుండా చూడటం లూలాకు ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది.

# భూమిపై భారీ ఉల్కాపాతం వయసు లెక్కింపు

**మొదటిపేజీ తరువాయి -** అమెరికాలోని ఓక్లహామాలో ఉన్న ఏమ్స్ ఉల్కాపాతం క్రేటర్ (బిలం) వయసును శాస్త్రవేత్తలు సవరించారు. గతంలో భావించినట్లుగా ఇది 46.7 కోట్ల ఏళ్ల క్రితం కాకుండా, సుమారు 37 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడిందని టెక్సాస్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తేల్చారు. అంటే, ఇప్పటివరకు ఉన్న అంచనా కంటే దీని వయసు దాదాపు 10 కోట్ల సంవత్సరాలు తక్కువ. ఈ కొత్త ఆవిష్కరణతో, భూమిపై భారీస్థాయిలో జీవరాశులు అంతరించిన కాలానికి ఈ ఉల్కాపాత సంఘటన దగ్గరగా జరిగినట్లు తెలుస్తోంది.ఓక్లహామాలోని ఏమ్స్ పట్టణం కింద కొన్ని మైళ్ల వెడల్పున ఈ బిలం విస్తరించి ఉంది. దశాబ్దాలుగా ఈ బిలం 'ఆర్డోవిషియన్ ఉల్కాపాత ఘటన'కు సంబంధించిందని భావిస్తూ వచ్చారు. ఆ బిలంలో లభించిన పురాతన జీవుల దంతాల అవశేషాల (కానోడాంట్ శిలాజాలు) ఆధారంగా గతంలో వయసును లెక్కించారు. అయితే, ఎలిజబెత్ క్యాట్లాస్ నేతృత్వంలోని పరిశోధక బృందం, ఉల్కాపాతం వల్ల కరిగిన రాళ్లలోని జిర్కాన్ స్ఫటికాలపై యురేనియం-లెడ్ డేటింగ్ పద్ధతిని ఉపయోగించి కొత్త వయసును కనుగొంది.తాజా పరిశోధన ప్రకారం, ఈ బిలం వయసు 36.97 కోట్ల సంవత్సరాలుగా నిర్ధారణ అయింది. ఉల్కాపాతం జరిగినప్పుడు, అంతకుముందే అక్కడ ఉన్న శిలల్లోని పాత శిలాజాలు బిలంలో కలిసిపోయాయని, అందుకే పాత అంచనాలు తప్పుగా వచ్చాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఈ కొత్త కాలక్రమం ప్రకారం, ఈ ఉల్కాపాతం సుమారు 37.2 కోట్ల ఏళ్ల క్రితం సముద్ర జీవరాశిని



నాశనం చేసిన భారీ వినాశనానికి దగ్గరగా జరిగింది.ఈ ఉల్కాపాతమే ఆ జీవరాశుల వినాశనానికి కారణమని కచ్చితంగా చెప్పలేనప్పటికీ, ఆ విపత్కర కాలంలోనే ఇది జరగడం కీలక పరిణామమని పరిశోధకులు అంటున్నారు. నమూనాలు పరిమితంగా ఉన్నందున, మరిన్ని పరిశోధనలు చేస్తే ఈ అంచనాలు మరింత బలపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కొత్త ఆవిష్కరణ ఉత్తర అమెరికాలో పురాతన ఉల్కాపాతాల విస్తరణపై అవగాహనను కూడా మార్చనుంది.

## ఐటీడీఏ ద్వారా వారసుల పేర్లపై ఆర్ ఓ ఎఫ్ ఆర్, పట్టాలు మార్పు అవకాశం సర్పంచ్ మడకం మూలమ్మ



**అశ్వాపురం అక్టోబర్ 05 ( తొలివార్త ):** వెంకటాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మడకం మూలమ్మ, మాట్లాడుతూ, అశ్వాపురం మండలంలో,గాని మరియు, వెంకటాపురం గ్రామ పంచాయతీ లోని, గిరిజనులు గతంలో,ఆర్ ఓ ఎఫ్ ఆర్ రికగ్నేషన్, ఆఫ్ రైట్స్ పట్టాలు పొందిన,సంబంధిత గిరిజన రైతులు వారి కుటుంబంలో ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాదారు వ్యక్తి ఎవరైనా మరణించి ఉంటే, వారికి,సంబంధించిన చట్టబద్ధమైన కుటుంబ సభ్యులు/వారసుల పేర్లపై ఆర్ ఓ ఎఫ్ ఆర్, పట్టాలను మార్చుకునే, అవకాశం ఉంది.కావున మరణించిన, వ్యక్తికి బంధుత్వం కలిగిన పట్టాదారు కుటుంబ సభ్యులు సంబంధిత, మరణ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, సంబంధిత పత్రాలు మరియు అందుబాటులో ఉన్న ఆర్ ఓ ఎఫ్ ఆర్, పట్టా తదితర అవసరమైన పత్రాలను తీసుకొని భద్రాచలం ఐ టి డి ఏ, కార్యాలయాన్ని సంప్రదించగలరు అని సర్పంచ్, మూలమ్మ తెలిపారు. అధికారుల సూచనల మేరకు అవసరమైన పత్రాలను సమర్పించి, అర్హత ఉన్నట్లయితే కుటుంబ సభ్యుల పేర్లపై ఆర్ ఓ ఎఫ్ ఆర్, పట్టా బదలాయింపు ప్రక్రియను చేపట్టుకోవచ్చు.కావున సంబంధిత కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం,చేసుకోవాలని,గ్రామపంచాయతీ సర్పంచ్ మడకం మూలమ్మ తెలియజేశారు.

## గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ సోషల్ వర్కర్ లతీఫ్





**వైరా అక్టోబర్ 05 ( తొలివార్త ):** సిరిపురం కేజీ గ్రామంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహిస్తున్న సోషల్ వర్కర్ లతీఫ్. స్టేజి పినపాక గ్రామానికి చెందిన వేషాల మంగ అనే గర్భిణీ స్త్రీని మరియు గౌండ్ల పాలెం గుండ్ల లాస్య అనే గర్భిణీ స్త్రీని మరియు మొక్క రేణుక అనే గర్భిణీ స్త్రీ ని టెస్టుల నిమిత్తం సోమవారం గవర్నమెంట్ హాస్పిటల్ తీసుకువెళ్లి టెస్టుల అనంతరం గర్భిణీ స్త్రీలను వారి ఇంటి వద్ద దింపడం జరిగింది. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ లతీఫ్ మాట్లాడుతూ సమాజానికి తాను ఎంతో కొంత సహాయం చేయాలని సంకల్పంతో ఈ ఒక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా పరీక్షల సమయంలో ఉచిత ఆటో సర్వీస్ నిర్వహించడం జరుగుతా ఉందని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సమాజంలో తోటి వారిపట్ల ప్రేమ దయా కరుణ క్షమా గుణముతో పాటు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని తెలిపారు. సోషల్ వర్కర్ లతీఫ్ సెల్ నెంబర్ 9603747878 కి ఫోన్ చేయగలరని తెలిపారు.

## విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

**విద్యుత్ వినియోగదారులకు సూపరింటెండెంట్ ఇంజనీర్ కందాల సురేష్ కుమార్ సూచన**






**భువనగిరి, అక్టోబర్ 05 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న భువనగిరి జిల్లా కేంద్రంలోని కిసాన్ నగర్‌లో ఉన్న విద్యుత్ కార్యాలయంలో నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కందాల సురేష్ కుమార్ కోరారు. కస్టమర్స్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) సభ్యుల సమక్షంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ సరఫరా, బిల్లులు, మీటర్లు, ఇతర విద్యుత్ సేవలకు సంబంధించిన సమస్యలు ఉన్న వినియోగదారులు ఈ సదస్సుకు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చే వినియోగదారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, సంబంధిత విద్యుత్ బిల్లుల రసీదులు తదితర అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాలని కందాల సురేష్ కుమార్ సూచించారు. వినియోగదారుల సమస్యలను సీజీఆర్ఎఫ్ సభ్యుల సమక్షంలో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని వినియోగించుకొని సదస్సుకు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో టెండర్లు ఖరారు





**వలిగొండ, అక్టోబర్ 05 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామంలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి అవసరమైన వివిధ వస్తువుల సరఫరా, పలు పనుల నిర్వహణకు సంబంధించి సీల్డ్ టెండర్లను సోమవారం దేవస్థానంలో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన టెండర్లలో పలు పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు కోటేషన్లు సమర్పించారు. టెండర్లలో వాల్ పోస్టర్లు, ఇన్విటేషన్ కార్డుల ముద్రణ పనులను వలిగొండకు చెందిన ఎలగందుల లెనిన్, తడకలు, పందిళ్లు, ఆర్చ్‌ల ఏర్పాటు పనులను సాయి కిరణ్, వలిగొండ; టికెట్ పుస్తకాల ముద్రణ పనులను నల్లగొండకు చెందిన పద్మజా ప్రింటర్స్; ఎలక్ట్రికల్ డెకరేషన్స్, మైక్ సెట్స్ ఏర్పాటు పనులను హైదరాబాద్‌కు చెందిన శివ జ్యోతి సౌండ్స్ దక్కించుకున్నారు. అదేవిధంగా రోజువారీ కూరగాయల సరఫరాకు వలిగొండకు చెందిన గొలుసుల శ్రీనివాస్, పాలు--పెరుగు సరఫరాకు అర్రూర్‌కు చెందిన ఆవుల సాయి మల్లు, సున్నాలు--రంగులు వేసే పనులకు చందుపట్లకు చెందిన దొడ్డి కిషన్ రావు, ఫ్లెక్సీలు, బ్యానర్ల ఫిట్టింగ్ పనులకు వలిగొండకు చెందిన బొమ్మగాని మహేష్ కోటేషన్లు సమర్పించారు. ఈ మేరకు టెండర్ ప్రక్రియను నిర్వహించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కొత్తపల్లి వెంకటయ్య గ్రేడ్-I ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల నిర్వహణలో దేవస్థానం చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, ధర్మకర్తలు కరుణాకర్ రెడ్డి, వెంకటేశం, జంగయ్య, రమేష్, అండాలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి..

**డ్రా పద్ధతిలో కాకుండా డ్రామా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక..**

**సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన,ర్యాలీ..**

**తహసీల్దార్ కార్యాలయ ముట్టడికి యత్నం..**

**అడ్డుకున్న పోలీసులు..**

**అర్హులకు ఇండ్లు ఇవ్వాలని సీపీఎం నాయకుల డిమాండ్..**






**నూతనకల్, అక్టోబర్ 05 ( తొలివార్త ):** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను రాజకీయ పలుకుబడితో అనర్హులకు కట్టబెట్టడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన 30 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలందరికీ కేటాయించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ నిరసన,ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అర్హులను పక్కనపెట్టి అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు.వ్యవసాయ భూములు,కార్లు,ఇండ్లు ఉన్న వారిని ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లబ్ధిదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేయాల్సి ఉండగా, డ్రామా పద్ధతిలో ఎంపిక చేసినట్లుగా పరిస్థితి కనిపిస్తోందని విమర్శించారు. నాయకుల ప్రోద్బలంతో అధికారులు అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని దీనిపై సమగ్ర విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులకు ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదలను విస్మరించి రాజకీయ అండదండలు ఉన్నవారికి ఇళ్లు కేటాయించడం పేదల హక్కులను కాలరాయడమేనని అన్నారు. ప్రభుత్వ ఇళ్ల పథకాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని ,నిజమైన అర్హులను గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సర్పంచ్,పాలక మండలికి సంబంధం లేకుండా ఎలా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం,అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. నిరసనలో భాగంగా సీపీఎం నాయకులు,కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు భారీగా చేరుకొని అడ్డుకున్నారు.దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం సీపీఎం నాయకులు ఎంపీడీవో సునీత కు సిపిఎం ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో చిల్పకుంట్ల గ్రామ ఉపసర్పంచ్ సామ సురేందర్ రెడ్డి, మండల నాయకులు తొట్ల లింగయ్య, బిక్కి అనిత, అంజపల్లి లక్ష్మయ్య, పోలేపాక నగేష్, బత్తుల తిరుమలేష్, గజ్జల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంల నరేష్, బొజ్జ రామస్వామి,బాధిత కుటుంబాలు,మహిళలు పాల్గొన్నారు.

# దుమ్ము ధూళి తో మణుగూరు ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి

**ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కి కర్నే బాబురావు వినతి**



**భద్రాద్రి జిల్లా, అక్టోబర్ 05 ( తొలివార్త ):** మణుగూరు సి ఎస్ పి, కాట సమీపంలోని ప్రధాన రహదారి ప్రజలకు నరకప్రాయంగా మారిందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు భారీ వాహనాల రాకపోకలు.. మరోవైపు రహదారికి ఇరువైపులా లారీల నిలుపుదల.. దీనికితోడు రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, బొగ్గు ధూళి. వాహనం కదిలితే చాలు దుమ్ము మేఘంలా ఎగిసిపడి రహదారిని కమ్మేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాదచారులు, స్థానిక ప్రజలు,తీవ్ర,ఇబ్బందులు, ఎదుర్కొంటున్నారు. దుమ్ము కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం నెలకొంది.అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. రహదారికి ఇరువైపులా లారీలను నిలిపివేయడంతో రోడ్డుకు అందుబాటులో ఉన్న వెడల్పు తగ్గిపోతోంది. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు ఇతర అత్యవసర వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి కనిపిస్తోంది.పార్కింగ్‌కు స్థలం ఉన్నా.. రోడ్డుపైనే లారీలు ఎందుకు...? లారీల పార్కింగ్ కోసం సింగరేణి యాజమాన్యం ఓల్డ్ స్టోర్ ప్రాంతంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ప్రధాన రహదారిపైనే లారీలను నిలిపివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక పార్కింగ్ ప్రాంతం ఉన్నప్పుడు రహదారిని పార్కింగ్ స్థలంగా మార్చాల్సిన అవసరం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రధాన రహదారిపై లారీలు నిలిపివేయకుండా సింగరేణి సెక్యూరిటీ విభాగం, పోలీస్ శాఖ సమన్వయంతో కఠినమైన పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.రోడ్డుపై పేరుకుపోయిన బొగ్గు ధూళి, మట్టి, దుమ్ము వాహనాల రాకపోకలతో గాలిలో కలుస్తుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిరంతరం దుమ్ము ఎగిసే పరిస్థితిని కేవలం ట్రాఫిక్ సమస్యగా కాకుండా ప్రజారోగ్యం, రహదారి భద్రతకు సంబంధించిన అత్యవసర సమస్యగా అధికారులు పరిగణించాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో సామాజిక బాధ్యత కలిగిన పౌరుడు కర్నే బాబురావు సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా మణుగూరు ఎంపీడీవో, కు వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులకు స్పష్టమైన డిమాండ్లు,సి ఎస్ పి కాట సమీపంలోని ప్రధాన రహదారిపై క్రమం తప్పకుండా నీటిని చల్లి దుమ్ము ఎగరకుండా చూడాలని కోరారు. రహదారిపై పేరుకుపోయిన దుమ్ము, బొగ్గు ధూళి, మట్టిని యంత్రాల సహాయంతో నిరంతరం తొలగించాలని విజ్ఞప్తి చేశారు. రహదారికి ఇరువైపులా లారీలను ఇష్టానుసారంగా నిలిపివేయకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఓల్డ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే మున్సిపాలిటీ, పోలీస్, ట్రాఫిక్, సింగరేణి యాజమాన్యం, సెక్యూరిటీ విభాగం మరియు సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేసి, అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు వంటి అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్బంధ రహిత మార్గం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యను అధికారులు కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలి. దుమ్ము, లారీ పార్కింగ్ సమస్యలకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి”అని కర్నే బాబురావు కోరారు.

# ఈనెల 8 న కలెక్టరేట్ లో సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్,ను విజయవంతం చేయాలని

**మండల అఖిల పక్ష పార్టీల నాయకులు పిలుపు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 05 ( తొలివార్త ):** సర్ పేరుతో ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలకు వ్యతిరేకంగా అఖిలపక్ష పార్టీల పిలుపు మేరకు నిర్వహిస్తున్న “సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ, సోమవారం, అశ్వాపురం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్ నందు కాంగ్రెస్ పార్టీ తో పాటు తెలుగుదేశం, సీపీఐ, సిపిఎం, టీజేఎస్, మరియు తెలంగాణ రాజ్యాధికార పార్టీ బాధ్యులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8 వ తేదీ జిల్లా కలెక్టర్ ఆర్యాలయం నుండి అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ‘సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్’ కార్యక్రమంలో అన్ని పార్టీల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని,అఖిలపక్ష,పార్టీ నాయకులు, కోరారు. ఓటు అనేది ప్రతి భారతీయుని ప్రాథమిక హక్కు అని, కేంద్ర బీజేపీ,మరియు, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్, మోసపూరిత కుట్రలతో, సర్ పేరుతో ఓట్లను తొలగించడం, ప్రతిపక్ష పార్టీలను తొక్కివేసే దురాలోచనలతో వ్యక్తుల ప్రాథమిక హక్కు ను హరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని, ఈ కుట్రను భగ్నం చేసే అవసరం అందరిపై ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరైనది.ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, మండల తెలుగు దేశం పార్టీ కార్యదర్శి జజ్జవరపు వాసు, ఏఐటీయూసి మండల అధ్యక్షుడు రాయపూడి రాజేష్, ఏదేల్లి కమలాకర్, తెలంగాణా రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడు ఇలాసాగరపు కోటేశ్వరరావు, తెలంగాణా రాజ్యాధికార పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల నాగేశ్వరావు, సిపిఎం పార్టీ కార్యవర్గ సభ్యులు మండేపూడి సాంబశివరావు, టీజేఎస్, మండల అధ్యక్షుడు పగడాల కరుణాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అఖిలపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంగీతం శ్రీనివాసరావు అకాల మృతి చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు సంతాపం తెలిపిన

**ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 05 ( తొలివార్త ):** బహుముఖ ప్రజ్ఞాశాలి, సృజనాత్మక సినీ దర్శకుడు స్వర్గీయ సింగీతం శ్రీనివాసరావు అకాల మృతికి, సంతాపం తెలిపి ఘనమైన నివాళులు అర్పించిన అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ బృందం!ప్రముఖ సినీ దర్శకులు స్వర్గీయ సింగీతం శ్రీనివాసరావు అకాల మృతి,భారతదేశ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు! అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్!భారతీయ సినీ రంగంలో. సృజనాత్మకతతో తనదైన శైలితో చెరగని ముద్ర వేసిన, బహుముఖ ప్రజ్ఞాశాలి , దిగ్గజ దర్శకుడు, వైవిధ్యమైన కథలు , వినూత్న ఆలోచనలు,సామాజిక సందేశం సామాజిక చైతన్యంతో కూడిన, ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలను మనకు అందించివయసు పైబడిన కూడా( 94 సంలు) ఇటీవల అశ్వనీ దత్ సింగ్ గీతం అనే చిత్రానికి దర్శకత్వం వహించడం ఆయనకు సినిమాలపై ఉన్న ఆసక్తికి, ప్రతిభ పాటవాలకి నిదర్శనమని వారి అకాల మరణం. భారతీయ చలన చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని,అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు. 5 10 2026 నాడు స్థానిక చుంచుపల్లి లో గల సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అత్యవసర సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ స్వర్గీయ సింగీతం శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి తన సంఘ సభ్యులందరితో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల మాట్లాడుతూ పుష్పక విమానం చిత్రంతో, మాటలు లేని మూకీ చిత్రం గా నిర్మించి, సంచలనం సృష్టించడమే,కాకుండా,యూనివర్సల్ ఉత్తమ నటుడు మరియు అందగాడు అయిన పద్మశ్రీ కమల్ హాసన్ తో విచిత్ర సహోదరులు లాంటి చిత్రంలో మరుగుజ్జు పాత్రను, భామనే సత్యభామనే చిత్రంలో పూర్తి మహిళా పాత్రను అంతేకాకుండా ఆదిత్య 369, భైరవద్వీపం, శ్రీకృష్ణార్జున విజయం మయూరి మైఖేల్ మదన కామరాజు ఇలాంటి ఎన్నో మధురమైన మరపురాని , చిత్రాలను మనకు అందించిన గొప్ప లెజెండరీ దర్శకుడు స్వర్గీయ సింగీతం శ్రీనివాసరావు ని ప్రతి ఒక్క వర్ధమాన సినీ దర్శకులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆచార్య డాక్టర్ మద్దెల పిలుపునిచ్చారు.ఈ ఆత్మీయ సంతాపనివాళి కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, ప్రముఖ సంగీత దర్శకులు అపర ఇళయరాజా మారపాక కృష్ణస్వామి , స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, జూనియర్ రెహమాన్ సలవాది విజయ్ , ప్రముఖ రిథమిస్ట్ దేవ సహాయం, గాయకుడు సబ్బారపు కృష్ణ,కళాకారులు ఎన్ వెంకటేశ్వర్లు,జనగం రాజయ్య, కడలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బుడ్డగూడెంలో ఇసుక జోరు నిర్లక్ష్యంతో సంబంధిత శాఖ అధికారులు





**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 05 ( తొలివార్త ):** బూర్గంపాడు మండల పరిధిలోని బుడ్డగూడెం పరిసర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు, రవాణా వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. రాత్రివేళల్లో ట్రాక్టర్లు, భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక తరలింపుతో గ్రామీణ, రహదారులు, దెబ్బతింటున్నాయని, ప్రజలకు, తీవ్ర,ఇబ్బందులు, ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాత్రివేళల్లో భారీ వాహనాల, రాకపోకలు, బుడ్డగూడెం పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఇసుక లోడుతో ట్రాక్టర్లు, లారీలు తిరుగుతున్నాయని, సంబంధిత శాఖ అధికారులు, నిర్లక్ష్యంతో, వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్లు దెబ్బతినడంతో పాటు దుమ్ము, శబ్దంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,పేర్కొంటున్నారు.రైతుల్లో ఆందోళన.ఇసుక తవ్వకాల ప్రభావం వ్యవసాయంపై పడుతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉందని, వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత తగ్గితే పంటలకు ఇబ్బందులు ఎదురవుతాయని వారు అంటున్నారు. అయితే ఈ అంశాలపై సంబంధిత అధికారులు శాస్త్రీయంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.రహదారులకు నష్టం,భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే ఇబ్బందికరంగా ఉన్న రోడ్లపై ఇసుక వాహనాల రాకపోకలు మరింత భారంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు.ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్.ఇసుక తవ్వకాలు, రవాణా వెనుక కొందరు ప్రభావశీలుల పాత్ర ఉందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు లేదా రవాణా జరుగుతున్నాయా? అనే అంశాలను తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.అధికారుల తనిఖీల కోసం ఎదురుచూపులు.బుడ్డగూడెం ప్రాంతంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు, రవాణాపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్,చేస్తున్నారు. బుడ్డగూడెంలో ఇసుక తవ్వకాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎప్పుడు చేపడతారు? అనేది వేచి చూడాల్సిందే...

# కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ ని తక్షణమే పదవి నుండి తొలగించాలి

**అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్**




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 05 ( తొలివార్త ):** రాజ్యాంగ హక్కులను పరిరక్షిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న (సర్) ప్రక్రియలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అవకతవకలను నిరసిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో మణుగూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఏఐసీసీ, ఇండియా కూటమి, ఆదేశాలమేరకు తెలంగాణ ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్, పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపుతో మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు, అఖిలపక్షంగా ఏర్పడి ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మణుగూరు సెంటర్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగుతూ అంబేద్కర్ సెంటర్‌కు చేరుకొని, అక్కడ అఖిలపక్ష పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి ఆయనను ఉద్యోగ బాధ్యతలు నుండి తొలగించాలివారు డిమాండ్ చేశారు.(సర్) ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి ఓటరుకు చెందిన ఓటు హక్కుకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వారు పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని, ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా, ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ముందుకు సాగాలని, రాజ్యాంగ హక్కులు మరియు ఓటు హక్కు పరిరక్షణకు నిరంతరం పోరాడాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, సిపిఐ డివిజన్ సెక్రటరీ సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, సిపిఐ ఎంఎల్ మసాలైన్ నాయకులు మధుసూదన్ రెడ్డి,సిపిఐ మండల సెక్రెటరీ జక్కుల రాజబాబు, సిపిఎం మండల సెక్రెటరీ సత్రపల్లి సాంబశివరావు, సిపిఐ టౌన్ సెక్రటరి దుర్గ్యాల సుధాకర్, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు బోనగిరి శివసైదులు, సారపు రాంరెడ్డి, సిపిఐ జిల్లా సమైక్య అధ్యక్షులు మున్నా లక్ష్మి కుమారి,మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కూరపాటి సౌజన్య, మైనార్టీ అధ్యక్షులు ఎండి రహీమ్ పాషా, సర్పంచ్ లు పాల్వంచ రాములు, కారం పూజిత, ఉపసర్పంచ్ లు గాండ్ల సురేష్, కనకయ్య,మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, ఐ ఎన్ టి యు సి, ప్రతినిధులు, లారీ యూనియన్ నాయకులు, బొగ్గు ముఠా కార్మికులు, గుమాస్తాల సంఘం ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, అఖిలపక్ష నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి

**ఖమ్మం వరంగల్ నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు**

**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 05 ( తొలివార్త ):**ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లకు ఓటర్ నమోదులో సహకారం అందించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ కాలనీలో జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో గ్రాడ్యుయేట్స్ ఓటర్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ,ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ హెల్త్ డైరెక్టర్, తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజర్, అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు.





**ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు కావాలి**

ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ దాన్ని బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువ పట్టభద్రులు తమ ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అన్నారు.

**గ్రాడ్యుయేట్లకు సహకారం అందించేందుకు కేంద్రం**

విద్యానగర్‌లోని జనసేన జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు కేంద్రం ద్వారా పట్టభద్రులకు అవసరమైన సమాచారం, నమోదు ప్రక్రియకు సంబంధించిన సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఓటర్ నమోదుకు సంబంధించి సందేహాలు ఉన్న వారికి వివరాలు తెలియజేసి, అవసరమైన విధానంపై అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత రాజకీయ ప్రక్రియలో భాగస్వాములు కావాలిదేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత చురుకుగా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉన్నత విద్యను పూర్తిచేసిన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు, ఎన్నికల సమయంలో తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా వ్యక్తం చేయాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని, దాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటే కీలకంలిఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్ జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించేందుకు పార్టీ తరఫున కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. పట్టభద్రుల సమస్యలు, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, విద్యా రంగానికి సంబంధించిన అంశాలను ఎమ్మెల్సీ ఎన్నికల వేదికగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

**నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

విద్యానగర్ కాలనీ జనసేన జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని పరిసర ప్రాంతాలకు చెందిన అర్హులైన పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని గడల శ్రీనివాసరావు కోరారు. ఓటర్ నమోదుకు వచ్చే వారికి అవసరమైన సమాచారం అందించడంతో పాటు, ప్రక్రియ పూర్తయ్యే వరకు సహకారం అందించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

# రాను నాయక్ నంగారా ఉత్సవాలను జయప్రదం చేయండి

**ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ పిలుపు.**

**గిరిజన సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ.**






**ఖమ్మం అక్టోబర్ 05 ( తొలివార్త ):** బంజారా హిల్స్‌ని మినిస్టర్స్ హోటల్స్ లో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి ఎం ధర్మానాయక్ ఆర్ శ్రీరామ్ నాయక్ భూక్య వీరభద్రం ఎం బాలు నాయక్ వాంకుడోత్ వీరన్న అశోక్ లతో కలిసి డాక్టర్ రామచంద్రనాయక్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలు అక్టోబర్ 10 11 తేదీల్లో హైదరాబాదులో జరుగుతున్న సందర్భంగా తెలంగాణ రైతన్న సాయుధ పోరాట యోధుడు రాను నాయక్ పేరుతో నంగారా ఉత్సవాలను హైదరాబాదులోని ఫలక్ నామ ప్రాంతంలోని రవీందర్ నాయక్ నగర్ లో పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలిపారు. అక్టోబర్ 10వ తేదీన ఉదయం 11:30 గంటలకు రవీందర్ నాయక్ నగర్ లోని లిమ్రా హోటల్ నుండి కళా ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన కళాకారులు ఆటపాటలతో ఉత్సవాలు రోజంతా జరుగుతాయని అన్నారు. గిరిజనుల సంస్కృతిని చాటి చెప్పే విధంగా జరుగుతున్న ఈ ఉత్సవాలలో తెలంగాణ వ్యాప్తంగా గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాయుధ రైతంగ పోరాటంలో వీరోచితంగా పోరాడి అమరుడైన గిరిజన యోధుడు రాను నాయక్ పేరు మీద జరగటం చాలా సంతోషకరమని అన్నారు. మారుతున్న గిరిజన జీవన విధానం వలన గిరిజన సంస్కృతి సంప్రదాయాలు అనుమరువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభినందనలతో ఆర్ శ్రీ రామ్ నాయక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ గిరిజన సంఘం.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలు అందజేసిన

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఐటిడిఏ పిఓ రాహుల్**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 05 ( తొలివార్త ):**భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలను భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ తో కలిసి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్ రెడ్డి కి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ...ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని కోరారు.ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అందించిన వైద్య పరికరాల ద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని, పేర్కొన్నారు. ఐటీడీఏ నిధులతో కంటి పరీక్ష, బ్లడ్ టెస్టింగ్, ఈసీజీ మిషన్లు, ఆక్సిజన్ సిలిండర్లు తదితర పరికరాల అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఐటీడీఏ పీవో బి.రాహుల్ చేతుల మీదుగా ఆసుపత్రికి వితరణ.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో ఐసీయూ ఇన్‌చార్జ్ డాక్టర్ జగదీష్ డాక్టర్ మల్లేష్,పార్టీ నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను, ఎండి సుభాని, కొప్పుల వంశీ మరియు హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహాసభను విజయవంతం చేయాలి



**నూతనకల్.. అక్టోబర్ 05 ( తొలివార్త ):** ఈనెల 6న హైదరాబాదులో ని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే ఎం ఎస్ ఎఫ్ మాదిగ విద్యార్థుల ప్రతినిధుల జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి వీరబాబు అన్నారు సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సభ నిర్వహిస్తున్నట్లు ఈ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బత్తుల సురేష్ గంట రామకృష్ణ గంట రవిశంకర్ మిరియాల చిరంజీవి సతీష్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## తిరుమలాపూర్ లో ఘనంగా పోషక మాసం సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం



**తుర్కపల్లి, అక్టోబర్ 05 ( తొలివార్త ):** తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ మాసం లో భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డోనికేని రేణుక వెంకటేష్, సిడిపిఓ రేఖల స్వరాజ్యం లు మాట్లాడుతూ బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని పిల్లలకు మంచి ఆహారాన్ని అందించాలని ,పోషకాలతో కూడిన ఆహారం అందించడం వలన వారి భవిష్యత్తు మంచిగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లు ఆరే అనిత, తునికి సునీత, ఆయాలు ,గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు

## తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి



**తుర్కపల్లి అక్టోబర్ 05 ( తొలివార్త ):** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి మాధవి లత అన్నారు. తుర్కపల్లి మండలం రామోజీ నాయక్ తండ లో జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి సూచనలతో మెగా డ్రైవ్ లో భాగంగా సోమవారం జిల్లా పరిపాలన విద్యాశాఖ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాదాద్రి భువనగిరి సంయుక్తంగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను పునర్ ప్రారంభించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకారంతో గ్రామంలో కుట్టు మిషన్ శిక్షణను గ్రామంలో మహిళలకు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు సీఎంఓ పి లింగారెడ్డి, ఎంఈఓ మంజూషా రాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు, మాదాపురం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం మాలతి ,అదనపు పీడి బి.ఆర్.డి.ఓ జంగారెడ్డి, గ్రామ సర్పంచ్ సతీష్, ఉపసర్పంచ్ రాములు, శిక్షణ సంస్థ డైరెక్టర్ కిషన్, ఇన్స్ట్రక్షన్ శ్రీనివాస్, న్యాయవాదులు గంధం నాగరాజు, ఐలయ్య పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలి

**ప్రజావాణిలో దరఖాస్తు చేస్తున్న దృశ్యం**




**తుర్కపల్లి, అక్టోబర్ 05 ( తొలివార్త ):** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని మండల మహిళా కూలీలు అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇచ్చిన ప్రజావాణిలో మండల నోడల్ అధికారి, ఎంపీడీవో లింకల గీతారెడ్డికి దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 -25 సంవత్సర మధ్యకాలంలో కనీసం 20 రోజులు ఉపాధి పనిచేసి గుంట భూమిలేని కూలీలకు సంవత్సరానికి 12,000 రెండు దఫాలుగా కూలీల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం గుర్తించింది కానీ, ఈ పథకం ఇప్పటివరకు పేద కూలీలకు అమలు చేయడం లేదన్నారు. రైతు భరోసా రైతు బీమా క్రాఫ్ట్ లోన్ వంటి సహాయం కూడా భూమి ఉన్న వారికే అన్ని అవకాశాలు అందుతున్నాయని, ప్రభుత్వం వెంటనే ఈ పథకాన్ని భూమిలేని కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా కూలీలు పాల్గొన్నారు

## పిట్టలగూడెం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**గుర్రంపోడు అక్టోబర్ 05 ( తొలివార్త ):** గుర్రంపోడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి పిట్టలగూడెం గ్రామానికి చెందిన కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మారెడ్డి యాదగిరి రెడ్డి, పిట్టలగూడెం ఉపసర్పంచ్ మారపాక అంబేద్కర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ కట్ట నరసింహ, నాయకులు పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఎంఎస్ఎఫ్ జాతీయ సాయి మహాసభను జయప్రదం చేయండి



**సూర్యాపేట( నేరేడుచర్ల) అక్టోబర్ 05 ( తొలివార్త ):** అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని లక్ష్యంతో నేరేడుచర్ల మండలంలోని జూనియర్ గౌట్ కళాశాలలో ఎంఎస్ఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా నాయకులు చంద్రయ్య మాదిగ జిల్లా నాయకులు యడవల్లి అరుణ్ మాదిగ మండల అధ్యక్షుడు మిడతపల్లి శీను మాదిగ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సామాజిక చైతన్యాన్ని పొందించుకోవాలని విద్యార్థుల హక్కులు మరియు సామాజిక న్యాయం కోసం ఎంఎస్ఎఫ్ కమిటీలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నూతన ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు ఉబ్బెపల్లి శ్యాము మాదిగ పాతకోటి కరుణాకర్ మాదిగ ఇంజమూరి సంజయ్ మచ్చ శ్రవణ్ సాలెం రాజు కృష్ణ సాయి చరణ్ సాత్విక్ పాల్గొన్నారు.

## గుండాల తహసిల్దార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 05 ( తొలివార్త ):జిల్లా బ్యూరో** గుండాల మండల తాసిల్దార్ కార్యాలయంలో భూమి రికార్డులను తారుమారు చేసి అక్రమ రిజిస్ట్రేషన్ కు పాల్పడిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూనెగూడెం గ్రామంలో 237 35 8 సర్వే నెంబర్లు గల భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన దాని కి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని అదే నూనె గూడెం గ్రామంలో గతంలో పెద్ద చెరువులో ఉన్న భూమిని కూడా అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని అసలైన పట్టేదారుడు ఇబ్బందులకు గురికాక తప్పడం లేదని ఇలాంటి అవినీతి అధికారులు ఉన్నంతవరకు మధ్యతరగతి రైతులకు ఇబ్బంది జరుగుతుందని వెంటనే రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది పై అధికారులు చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్య లు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పింగళి విజయభాస్కర్ రెడ్డి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎరుకల శారద గౌడ్ బీజేవైఎం జిల్లా ఐటీ సెల్ బుక్క చంద్రశేఖర్ మండల కోశాధికారి పరమేశ్వరి మహిళా మోర్చా అధ్యక్షురాలు సంగీత బిజెపి సీనియర్ నాయకులు సింగారం సోమరాజు గోపాల్ కాలి సుమలత సైదులు గుండాల బూత్ అధ్యక్షుడు సోమన్న నూనె గూడెంఅధ్యక్షుడు మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలి..

**మాజీ వైస్ ఎంపీపీ జక్కి పరమేష్ గౌడ్..**



**నూతనకల్, అక్టోబర్ 05 ( తొలివార్త ):** పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్ రెడ్డికి పట్టబద్రులు మద్దతు తెలపాలని వైస్ ఎంపీపీ జక్కి పరమేష్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యావంతుడైన రాకేష్ రెడ్డి ని గెలిపించినట్లయితే నిరుద్యోగుల పట్ల పోరాటం చేసి వారి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వాలపై పోరాడతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు కనకటి లింగయ్య,మన్నెం రమేష్, మన్నెం సైదులు,ఏక స్వామి,భరత్,వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఇద్దరు సిఐలకు స్థానచలనం





**భద్రాచలం అక్టోబర్ 05 ( తొలివార్త ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు, కొత్తగూడెం వన్ టౌన్ సిఐగా సముద్రాల జితేందర్ కి, మరియు,భద్రాచలం పట్టణ సీఐగా సట్ల రాజు, బాధ్యతలు చేపట్టనున్నారు గతంలో అశ్వాపురంలో, పోలీస్ స్టేషన్లో సిఐ గా, విధులు నిర్వహించిన ఆయన కు, పోలీస్ శాఖలో అనుభవం ఉంది అశ్వాపురంలో సీఐగా సట్ల రాజు విధులు నిర్వహించిన సమయంలో శాంతి భద్రతల పై, కఠినంగా వ్యవహరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, తనదైన శైలిలో సేవలందించారు. అదేవిధంగా భద్రాచలం పట్టణంలో శాంతిభద్రతల ట్రాఫిక్ నియంత్రణ నేరాలు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలుస్తుంది. అశ్వాపురం పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహించిన జితేందర్, పోలీస్ శాఖలో అనుభవం ఉంది ఆయన అశ్వాపురంలో విధులు నిర్వహించిన సమయంలో,శాంతి భద్రతల పై కఠినంగా వ్యవహరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ తనదైన శైలిలో సేవలందించారని ఇప్పుడు కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సిఐగా జితేందర్ బాధ్యతలు చేపట్టనున్నారని కొత్తగూడెం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ ట్రాఫిక్ నియంత్రణ నేరాలు నియంత్రణపై, గంజాయి డ్రగ్స్, వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తుంది. ప్రజలకు, వారు ఇరువురు, సిఐలు గొప్ప సేవలు అందించనున్నారు.

తొలివార్త
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A0357
మంగళవారం 06 -10 - 2026

# లాటరీ పద్ధతిలోనే డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ..

## ఎంపీడీవో సునీత..




**నూతనకల్, అక్టోబర్ 05 ( తొలివార్త ):** మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన ఎల్ 2 లిస్టులో ఉన్న 113 పేర్లకుగానూ గెజిటెడ్ అధికారుల తనిఖీలో 30 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి లాటరీ పద్ధతిలో వారికి లేఅవుట్ మ్యాప్ ప్రకారం నెంబర్లను ఇచ్చి ఇండ్లను పంపిణీ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి సునీత సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎండి జబ్బార్,మండల తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీఓ హరి సింగ్, పంచాయతీ కార్యదర్శి గంగరాజు, హౌసింగ్ ఏఈ సాయి సింహ, ఎస్ హెచ్ ఓ నాగరాజు,ఆయా శాఖల అధికారులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాయం ఆదేశాలతో లబ్ధిదారులకు రూ 34 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన

## మణుగూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 05 ( తొలివార్త ):** మణుగూరు మండలంలోని సుందరయ్య నగర్‌కు చెందిన కరిపే చంద్రశేఖర్ కు, మరియు వేరే ఇరు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్, ద్వారా మంజూరైన రూ.34 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును తెలంగాణ ఎస్టి సంక్షేమ కమిటీ చైర్మన్, మరియు పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, సోమవారం నాడు, మణుగూరు పట్టణంలో నీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, లబ్ధిదారులకు, అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. వారు మాట్లాడుతూ పేదలు,ఆపదలో ఉన్న కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తామని, ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ దొబ్బల వెంకటప్పయ్య, పట్టణ కాంగ్రెస్ నాయకులు వాసంశెట్టి వెంకట్రావు,కొర్లకుంట అప్పారావు అబ్దుల్లా,చింతల కృష్ణ, పొడుతూరి నానాజీ, దేశబోయిన లవకుమార్, దాసరి లింగయ్య, మునిగల బిక్షం, గనిబోయిన నాగేశ్వరరావు, బత్తుల శ్రీను, చప్పిడి సుబ్రహ్మణ్యం, గుమ్మల వెంకటేశ్వర్లు,ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు పొడుతూరి రవి, మహిళా నాయకులు,జీడి దేవి, మౌనిక, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయం ముట్టడి....

## కలెక్టర్‌ను కలిసేందుకు గంటల తరబడి నిరీక్షణ..

## చివరకు రోడ్డుపైకి ఆదివాసీలు!

## కొత్తగూడెంలో ఆదివాసీలు నిరసన తారస్థాయికి చేరింది.

## హాజరైన బూర్గంపాడు మండల ఆదివాసులు....







**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 05 ( తొలివార్త ):** తమ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు రిప్రజెంటేషన్ అందించేందుకు రెండు గంటలకుపైగా వేచి చూసిన ఆదివాసీలు, కలెక్టర్ రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వచ్చిన తమకు కలెక్టర్‌ను కలిసే అవకాశం కల్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ రహదారిపై రెండు వైపులా కూర్చొని నిరసనకు దిగారు. దీంతో కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి, రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. “మా సమస్యలు వినే వరకు మా పోరాటం ఆగదు” అంటూ ఆదివాసీలు నినదించారు. ఆదివాసీల సమస్యలపై జిల్లా యంత్రాంగం స్పందించి, వెంటనే ప్రతినిధులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొత్త గూడెం ఆదివాసి సంఘాలు చేపట్టిన మహా ధర్నా సాయంత్రం 6 గంటలు దాటిన కొనసాగుతున్నట్లు సమాచారం. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆదివాసి నాయకులు ,మహిళలు ,యువత ,పెద్ద సంఖ్యలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బూర్గంపాడు మండలం నుంచి ఆదివాసి నాయకులు, మహిళలు, యువత ,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు కోర్టుకు కు తరలింపు అశ్వాపురం సిఐ ఎల్లయ్య




**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 05 ( తొలివార్త ):** అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వాయిపాడు గ్రామ శివారులో ఉన్న రాజీవ్ సాగర్ కాలువకు సంబంధించిన ఇనుప పైపులను దొంగతనం చేశారని ఇరిగేషన్ ఏ ఈ ఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది. సోమవారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు అశ్వాపురం సీఐ ఎల్లయ్య తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా ఈ క్రింది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.1. పోడియం అనిల్ కుమార్, సర్వాయిపాడు బంజారా గ్రామం,2. కురుసం రాంబాబు, సర్వాయిపాడు బంజారా గ్రామం,3. బోళ్ల నరసయ్య,అశ్వాపురం,4. కారం నరేష్, కొత్త సూరారం,5. కుంట శ్రీను,అశ్వాపురం6. తడకమళ్ల,ప్రసాద్,అశ్వాపురం,వారిని,విచారించగా,సర్వాయిపాడు బంజారా గ్రామ శివారులో గల రాజీవ్ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పెద్ద ఇనుప పైపును గ్యాస్ కట్టర్ సహాయంతో కట్ చేసి, దాని విడిభాగాలను దొంగతనంగా తరలిస్తున్నట్లు,ఒప్పుకున్నారు.తదనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ అనంతరం రిమాండ్ నిమిత్తం మణుగూరు కోర్టుకు తరలించడం జరిగింది. అని సీఐ ఎల్లయ్య తెలిపారు.

# గిరీశ్వర్ రెడ్డి చొరవతో సీసీ కెమెరాల ఏర్పాటు

## నిఘా నేత్రంలో ఎంపీపీ పాఠశాల

## గిరీశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన పాఠశాల సిబ్బంది





నందికొట్కూరు , **అక్టోబర్ 05 ( తొలివార్త ):** జూపాడుబంగ్లా మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, టీడీపీ జిల్లా నేత గిరీశ్వర్ రెడ్డి చొరవతో గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గిరీశ్వర్ రెడ్డి సొంత నిధులతో రూ.25 వేలు తో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని ఈ పాఠశాలలో ఎవరు కూడా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండేందుకు, విద్యార్థుల భద్రత కొరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమన్నరు. గ్రామ అభివృద్ధి కి తనవంతు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గిరీశ్వర్ రెడ్డికి పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# స్మోకింగ్ జోన్లుగా మారుతున్న టీ స్టాళ్లు - నిబంధనలు గాలికి వదిలి ఇష్టారాజ్యంగా నిర్వహణ

రాష్ట్రంలో పలుచోట్ల రహదారుల పక్కన టీస్టాళ్లు, కాఫీ కేఫ్ లలో సిగరెట్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వీటిపై సర్కారు విధించిన నిబంధనలు కాగితాలకు మాత్రమే పరిమితమయ్యాయి. పలుచోట్ల బహిరంగ ధూమపానం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలతోపాటు జాతీయ రహదారుల వెంట రకరకాల ఆకర్షణీయ పేర్లతో ఏర్పాటవుతున్న టీస్టాళ్లు, కాఫీ కేఫ్‌లు యువతను ఆకర్షిస్తున్నాయి. సరదాగా స్నేహితులతో కలిసి టీ స్టాళ్లకు వెళ్తున్న యువత, టీతో పాటు సిగరెట్లు కాలుస్తూ ఆరోగ్యాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. పాన్ డబ్బాలు, కిరాణా దుకాణాల్లోనూ సిగరెట్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. యువత ఆసక్తికి తోడు పలు టీ షాప్‌లలో స్మోకింగ్ జోన్లను సైతం ఏర్పాటు చేస్తుండడంతో వాటిలో పొగ గుప్పుగుప్పుమనడం ఆందోళన కలిగిస్తోంది. సిగరెట్ తాగిన వారితో పాటు పక్కవారికి కూడా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ధూమపానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి ప్రభుత్వ నిబంధనలు ఏం చెబుతున్నాయి అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

### బహిరంగ ధూమపానం



సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై సర్కారు విధించిన నిబంధనలు చాలా చోట్ల కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. బహిరంగ ధూమపానం యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. మరో వైపు పద్దెనిమిది సంవత్సరాలలోపు వారికి సిగరెట్లను విక్రయించరాదని నిబంధనలున్నా షాప్‌ల నిర్వాహకులు తుంగలో తొక్కేస్తున్నారు. దీంతో ఎనిమిదో తరగతి నుంచే అనేక మంది ధూమపానానికి అలవాటు పడుతున్నారు.

### తెరలు కట్టి

నగరంలో రోడ్ల వెంట ఉన్న పలు టీ స్టాళ్లలో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది షాప్‌ల నిర్వాహకులు స్మోక్ జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్మాకింగ్ అలవాటు లేని వ్యక్తుల ఆరోగ్యం కూడా క్రమంగా దెబ్బతింటోంది.“సిగరెట్ తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో వెలుగు చూస్తున్న ఊపిరితిత్తులు, పెద్దపేగు, గొంతు క్యాన్సర్ బాధితుల్లో అధికశాతం (95 శాతం) మంది పైగా ధూమపానం వల్లనే వ్యాధి బారిన పడడం ఆందోళన కలిగించే అంశం” -డాక్టర్ బి.రంగయ్య, ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్, మిర్యాలగూడ

### ప్రభుత్వ నిబంధనలు ఏం చెబుతున్నాయంటే

ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, సినిమా థియేటర్లు, రైల్వే స్టేషన్లు, రెస్టారెంట్లు తదితర బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం. కేవలం 30కి పైగా రూంలు ఉన్న హోటళ్లలో మాత్రమే స్మోకింగ్ జోన్ల ఏర్పాటుకు అనుమతి ఉంటుంది. పద్దెనిమిదేళ్ల లోపు వారికి సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నిషేధం. పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరం పరిధిలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల విక్రయించకూడదు.

# అనంతపురంలో బర్డ్ ఫ్లూ కలకలం 2,000కుపైగా కోళ్లు మరణించడంతో అధికారులు అప్రమత్తం

అనంతపురం జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టించింది. గత నెలలో ఈ వ్యాధి కారణంగా 2,000కుపైగా కోళ్లు మరణించడంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఒక కిలోమీటర్ పరిధిని “రెడ్ జోన్”గా ప్రకటించారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామంలో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టించింది. గత నెలలో ఈ వ్యాధి కారణంగా 2,000కు పైగా కోళ్లు మరణించడంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కోళ్ల నుంచి మనుషులకు వ్యాధి వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్న అధికారులు, బర్డ్ ఫ్లూ వ్యాప్తి, లక్షణాలు, దాని ప్రభావం, తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక దంపతులైన లక్ష్మీదేవి, నాగన్న తమ పొలంలో పెంచడానికి హైదరాబాద్ నుంచి 2,500 నాటు కోళ్లను తెచ్చారు. గత నెల 28న ఒక్క రోజులోనే 2,000 కోళ్లు చనిపోగా, మిగిలినవి ఆ తర్వాత మరణించాయి.ఒక కిలోమీటర్ వరకు రెడ్ జోన్ : పశుసంవర్ధక శాఖ అధికారులు రత్నకుమార్ గోవిందరాజులు గ్రామాన్ని సందర్శించి కోళ్లను పరిశీలించి, నమూనాలను భోపాల్‌లోని ప్రయోగశాలకు పంపారు. ఆదివారం అందిన నివేదికలో ఈ మరణాలకు బర్డ్ ఫ్లూ కారణమని నిర్ధారణ అయింది. దీనికి స్పందనగా, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) ప్రేమ్‌చంద్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆ ప్రాంతం చుట్టూ ఒక కిలోమీటర్ పరిధిని “రెడ్ జోన్”గా ప్రకటించారు. కోళ్లను నిర్మూలించి గుంతలలో పూడ్చిపెట్టేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులకు అప్పగించాలని స్థానికులకు సూచించారు.తరలించడాన్ని పూర్తిగ నిషేధించిన అధికారులు కోళ్లను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. గ్రామంలోకి కోళ్లు, గుడ్లు, కోళ్ల దాణా రవాణా చేయడాన్ని అలాగే వాటిని బయటి ప్రాంతాలకు తరలించడాన్ని పూర్తిగా నిషేధించారు. పొడి దగ్గు, జలుబు లేదా తుమ్ములు తరచుగా వస్తుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని వారు సూచించారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీవో సోలమన్ రాజు, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.వైరస్‌లో ఉపరకం బర్డ్ ఫ్లూ అనేది ఇన్ఫ్లుయెంజా వైరస్ ఉపరకం. ఇది పక్షులు, క్షీరదాలను ప్రభావితం




చేస్తుంది. అరుదుగా మానవులకు సోకుతుంది. వ్యాధి సోకిన పక్షులు లేదా ఇతర జంతువులతో సన్నిహితంగా ఉండటం ద్వారా, అలాగే కలుషితమైన పరిసరాల ద్వారా మానవులకు ఇది వ్యాపించే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన కోళ్లను తాకడం ద్వారా లేదా అనారోగ్యంతో ఉన్న కోళ్లను తినడం ద్వారా మానవులకు బర్డ్ ఫ్లూ సోకవచ్చు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ వైరస్ పక్షుల నుంచి మానవులకు శ్వాసకోశ మార్గం, జీర్ణకోశ మార్గం, కంజంక్టివా (కంటి పొరలు) ద్వారా వ్యాపిస్తుందని పేర్కొన్నారు.

# దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ ఇళ్లు ఏపీలో సరికొత్త గృహ నిర్మాణ శకం

తొలిసారిగా అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో నిర్మించే ఇళ్లకు గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం వేదికగా నిలిచింది. ఈ ఇళ్ల నిర్మాణానికి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. తక్కువ ఖర్చు, ఎక్కువ మన్నిక, ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా తట్టుకునే సామర్థ్యంతో గృహ నిర్మాణ రంగంలో ఏపీ సరికొత్త అధ్యాయానికి తెరతీసింది. దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో నిర్మించే ఇళ్లకు గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం వేదికగా నిలిచింది. ఈ నూతన సాంకేతికతతో చేపడుతున్న ఇళ్ల నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నమూనా ప్రదర్శనను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులతో కలిసి వారు పరిశీలించారు.పరిశ్రమల్లో 20 ఏళ్లుగా 3డీ ప్రింటింగ్ ఉపయోగిస్తున్నప్పటికీ గృహ నిర్మాణంలోకి తీసుకురావడం దేశంలోనే ఇదే తొలిసారి అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఇనుప కడ్డీలను వినియోగించరు. దీనివల్ల ఇనుము తుప్పు పడుతుందనే సమస్యే ఉత్పన్నం కాదని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) చీఫ్ సైంటిస్ట్ అజయ్ చౌరాసియా వివరించారు. కేవలం 20 శాతం సిమెంట్, 70 శాతం ఫ్లైయాష్, 0.1 శాతం పీపీ ఫైబర్‌తో పాటు విస్కాసిటీ మోడిఫైయింగ్ ఏజెంట్, సూపర్ ప్లాస్టిసైజర్ వంటి రసాయనాలను ఇందులో వినియోగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఇళ్లకు 80 నుంచి 90 ఏళ్ల పాటు మన్నిక ఉంటుందని, భూకంపాలు, వరదల్లాంటి ప్రకృతి విపత్తులను సైతం తట్టుకుంటాయని



వివరించారు.ఏసీ లేకుండానే చల్లదనం : ఈ అత్యాధునిక సాంకేతికతతో 100 ఇళ్లను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. దీనికి సీబీఆర్ఐ సైంటిస్ట్ అజయ్ బదులిస్తూ కేవలం 3 నెలల్లోనే 100 గృహాలను సిద్ధం చేయవచ్చని తెలిపారు. సగటున ఒక్కో ఇంటి నిర్మాణానికి కేవలం 10 రోజులు మాత్రమే పడుతుందన్నారు. సాధారణ ఇళ్లతో పోలిస్తే 20 నుంచి 30 శాతం వరకు ఖర్చు ఆదా అవుతుందని వివరించారు. 3డీ విధానంలో గోడలను పొరలు పొరలుగా నిర్మిస్తారు. ఈ పొరల మధ్య ఉండే ఖాళీల్లో మట్టిని నింపడం వల్ల వేడిని సులభంగా నియంత్రించవచ్చు. ఏసీలు, కరెంటు వాడకం లేకుండానే బయటి వాతావరణం కంటే లోపల 8 డిగ్రీల సెల్సియస్ తక్కువ ఉష్ణోగ్రత ఉంటుందని అధికారులు తెలిపారు. గోడల్లో తేమ, సీపేజ్ ఇబ్బందులు అస్సలు ఉండవు. ఖాళీల గుండా ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వైర్లను సులభంగా అమర్చుకోవచ్చు. 2 అంతస్తులు నిర్మించుకునేలా పునాది కూడా పటిష్ఠంగా ఉంటుంది.ఇళ్లు నిర్మించే చిన్న 3డీ ప్రింటింగ్ యంత్రం ధర రూ.50 లక్షలు కాగా, పెద్ద యంత్రం ధర రూ.1.40 కోట్లు ఉంటుంది. వీటి కాలపరిమితి మూడేళ్లు. ఒక్కో యంత్రంతో 3 వేల ఇళ్లను నిర్మించవచ్చు. యంత్రం, నిర్మాణ వ్యయాలను కలిపితే ఒక్కో ఇంటి సూపర్ స్ట్రక్చర్‌కు సుమారు రూ.2.50 లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ కొత్త విధానం వాణిజ్యపరంగా సక్సెస్ అయితేనే భారీ ఎత్తున విస్తరించగలమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెంలో చేపట్టిన 177 ఇళ్లను ముందుగా మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత పది యంత్రాలను కొనుగోలు చేసి 5 వేల ఇళ్లను నిర్మిద్దామని దిశానిర్దేశం చేశారు. ఈ భారీ ప్రాజెక్టులో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేసి, వారికి ప్రత్యేక శిక్షణ అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. డ్వాక్రా సంఘాల ద్వారా యంత్రాలను కొనుగోలు చేయించి వారికి స్థిరమైన ఆదాయం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.‘సీఎం స్ఫూర్తితోనే ఐఏఎస్ అయ్యా’: ఎన్టీఆర్ హయాం నుంచి 2014-19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు పేదల గృహనిర్మాణంలో తీసుకొచ్చిన వినూత్న సంస్కరణలను గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సిబారాణి ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వివరించారు. ఇదే క్రమంలో సీఎం చంద్రబాబు ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. “హెప్సిబారాణి తండ్రి ఒకప్పుడు నా హయాంలో గృహనిర్మాణ శాఖలో ఏఈగా పనిచేశారు. ఇప్పుడు ఆమె అదే శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు” అని తెలిపారు. దీనికి హెప్సిబారాణి స్పందిస్తూ, “నా చిన్నతనంలో సీఎంగా చంద్రబాబు గారు మా ఇంటికి వచ్చారు. ఆ రోజు ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే నేను ఐఏఎస్ అధికారిని అయ్యాను. రాష్ట్రంలో సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఇక్కడికి వచ్చాను” అని వివరించారు.

# తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ!

డిసెంబర్ 11న గచ్చిబౌలి మైదానంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం, 22న ఎల్‌బీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ముగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యే అవకాశాలున్నాయని అధికారవర్గాల సమాచారం. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (కేఐవైజీ) 8వ ఎడిషన్ నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. మొత్తం 27 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించడానికి హైదరాబాద్, హనుమకొండ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం నగరాల్లో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. దేశం నలుమూలల నుంచి వచ్చే 7,500 మందికి పైగా క్రీడాకారులకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. వీరితో పాటు మరో 1,500 మంది సహాయక సిబ్బంది, 1000 మంది టెక్నికల్ అధికారులు రానున్నారు. డిసెంబరు 11 నుంచి 22 వరకు ఈ కేఐవై గేమ్స్ జరగనున్నాయి.11న గచ్చిబౌలి మైదానంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల సమాచారం. 22న ఎల్బీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ముగింపు కార్యక్రమాలను చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్పోర్ట్స్ పాలసీకి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ క్రీడలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా ప్లాన్ చేస్తోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నారు.

### ప్రత్యేక ఆకర్షణగా హుస్సేన్‌సాగర్ వాటర్ స్పోర్ట్స్

ఖేలో ఇండియా గేమ్స్‌లో భాగంగా హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించే వాటర్ స్పోర్ట్స్ ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక్కడ కయాకింగ్, రోయింగ్, కానోయింగ్ వంటి విభాగాలను నిర్వహించనున్నారు. గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో వివిధ జిల్లాల్లో ఒక్కో క్రీడను నిర్వహించడానికి ఆయా జిల్లాలను ఎంపిక చేశారు. హనుమకొండలో అథ్లెటిక్స్, మహబూబ్‌నగర్‌లో కబడ్డీ, నిజామాబాద్‌లో టేబుల్ టెన్నిస్, కరీంనగర్‌లో జూడో, ఖమ్మంలో ఆర్చరీ పోటీలను నిర్వహిస్తారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, సరూర్‌నగర్, జేఎన్టీయూ, సికింద్రాబాద్ ఇండోర్, ఎల్బీనగర్, యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియాల్లో మిగతా క్రీడలను నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

### 5 కమిటీల ఏర్పాటు

ఈ క్రీడలను ఘనంగా నిర్వహించడానికి ఐదు రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేయగా, అందులో ఆర్గనైజింగ్ కమిటీకి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కో ఛైర్మన్‌గా కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఉన్నారు. క్రీడాకారులు, అతిథుల వసతి, భోజనం, రవాణా తదితర ఏర్పాట్ల కోసం ప్రత్యేక ఉన్నత స్థాయి కమిటీని అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్రం నిర్వహిస్తున్న ఈ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా 2024, 2025లో మహారాష్ట్ర అత్యధిక స్వర్ణాలు గెలిచి విజేతగా నిలిచింది. ఈ ఏడాది నిర్వహణకు కేంద్ర యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ తెలంగాణకు ప్రాధాన్యం ఇచ్చింది. వీటి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్ల నిధులను కేటాయించింది.

### ప్రధాన క్రీడలు

బాక్సింగ్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, జూడో, ఖో-ఖో, కబడ్డీ, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్

### సంప్రదాయ క్రీడలు

గట్కా, థాంగ్-టా, యోగాసన, మల్లఖంబ్, కలరియపట్టు తెలంగాణ ఆతిథ్య క్రీడ రోయింగ్ ప్రదర్శన క్రీడ సెయిలింగ్ ఎడిషన్ క్రీడ సాఫ్ట్‌బాల్.

# హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం.. 9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తుది హెచ్చరిక

## అక్టోబరు 9 లోగా లక్ష రూపాయలు చెల్లించాలని ఆదేశం

## గడువు దాటితే ప్రొవిజనల్ అలాట్‌మెంట్ రద్దు చేస్తామని స్పష్టీకరణ

## ఇప్పటికే 59 శాతం మంది లబ్ధిదారుల చెల్లింపులు పూర్తి

## ఖాళీ అయ్యే ఇళ్లు వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికి కేటాయింపు

హైదరాబాద్ నగరంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సిన లక్ష రూపాయల మొత్తానికి అక్టోబరు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా డబ్బు చెల్లించని వారి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ లెటర్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేస్తామని స్పష్టం



చేసింది.తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 5,501 మందికి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, ఇప్పటివరకు 3,271 మంది (దాదాపు 59.46 శాతం) మాత్రమే తమ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే స్పందించి, గడువులోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు పూర్తి చేయాలని ఆయన కోరారు.అక్టోబరు 9 తర్వాత గడువును పొడిగించే ప్రసక్తే లేదని కమిషనర్ గౌతమ్ తేల్చిచెప్పారు. గడువులోగా చెల్లించడంలో విఫలమైన వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ ఖాళీలను వెయిటింగ్ లిస్టులో ఉన్న సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయిస్తామన్నారు. రాబోయే నెలల్లో లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు.అయితే, ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాలని చెబుతుండటంతో, ఆ పద్ధతి తెలియని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకం, కేటాయింపు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ం+నదీ.వశ్రీఖఅస్త్రుఖు.ప్రశీజ.ఱఅను సందర్శించాలని లేదా హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ 040-24603572లో సంప్రదించాలని అధికారులు సూచించారు. కేటాయింపుదారులకు వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు వాట్సాప్ ద్వారా కూడా సమాచారం పంపుతున్నట్లు వారు తెలిపారు.

# స్మోకింగ్ జోన్లుగా మారుతున్న టీ స్టాళ్లు - నిబంధనలు గాలికి వదిలి ఇష్టారాజ్యంగా నిర్వహణ

రాష్ట్రంలో పలుచోట్ల రహదారుల పక్కన టీస్టాళ్లు, కాఫీ కేఫ్ లలో సిగరెట్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వీటిపై సర్కారు విధించిన నిబంధనలు కాగితాలకు మాత్రమే పరిమితయ్యాయి. పలుచోట్ల బహిరంగ ధూమపానం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలతోపాటు జాతీయ రహదారుల వెంట రకరకాల ఆకర్షణీయ పేర్లతో ఏర్పాటవుతున్న టీస్టాళ్లు, కాఫీ కేఫ్‌లు యువతను ఆకర్షిస్తున్నాయి. సరదాగా స్నేహితులతో కలిసి టీ స్టాళ్లకు వెళ్తున్న యువత, టీతో పాటు సిగరెట్లు కాలుస్తూ ఆరోగ్యాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. పాన్ డబ్బాలు, కిరాణా దుకాణాల్లోనూ సిగరెట్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. యువత ఆసక్తికి తోడు పలు టీ షాప్‌లలో స్మోకింగ్ జోన్లను సైతం ఏర్పాటు చేస్తుండడంతో వాటిలో పొగ గుప్పుగుప్పుమనడం ఆందోళన కలిగిస్తోంది. సిగరెట్ తాగిన వారితో పాటు పక్కవారికి కూడా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ధూమపానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి ప్రభుత్వ నిబంధనలు ఏం చెబుతున్నాయి అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.



## బహిరంగ ధూమపానం

సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై సర్కారు విధించిన నిబంధనలు చాలా చోట్ల కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. బహిరంగ ధూమపానం యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. మరో వైపు పద్దెనిమిది సంవత్సరాలలోపు వారికి సిగరెట్లను విక్రయించరాదని నిబంధనలున్నా షాప్‌ల నిర్వాహకులు తుంగలో తొక్కేస్తున్నారు. దీంతో ఎనిమిదో తరగతి నుంచే అనేక మంది ధూమపానానికి అలవాటు పడుతున్నారు.

## తెరలు కట్టి

నగరంలో రోడ్ల వెంట ఉన్న పలు టీ స్టాళ్లలో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది షాప్‌ల నిర్వాహకులు స్మోక్ జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్మాకింగ్ అలవాటు లేని వ్యక్తుల ఆరోగ్యం కూడా క్రమంగా దెబ్బదింటోంది."సిగరెట్ తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో వెలుగు చూస్తున్న ఊపిరితిత్తులు, పెద్దపేగు, గొంతు క్యాన్సర్ బాధితుల్లో అధికశాతం (95 శాతం) మంది పైగా ధూమపానం వల్లనే వ్యాధి బారిన పడడం ఆందోళన కలిగించే అంశం" -డాక్టర్ బి.రంగయ్య, ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్, మిర్యాలగూడ

## ప్రభుత్వ నిబంధనలు ఏం చెబుతున్నాయంటే

ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, సినిమా థియేటర్లు, రైల్వే స్టేషన్లు, రెస్టారెంట్లు తదితర బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం. కేవలం 30కి పైగా రూంలు ఉన్న హోటళ్లలో మాత్రమే స్మోకింగ్ జోన్ల ఏర్పాటుకు అనుమతి ఉంటుంది. పద్దెనిమిదేళ్ల లోపు వారికి సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నిషేధం. పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరం పరిధిలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల విక్రయించకూడదు.

# అనంతపురంలో బర్డ్ ఫ్లూ కలకలం 2,000కుపైగా కోళ్లు మరణించడంతో అధికారులు అప్రమత్తం

అనంతపురం జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టించింది. గత నెలలో ఈ వ్యాధి కారణంగా 2,000కుపైగా కోళ్లు మరణించడంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఒక కిలోమీటర్ పరిధిని "రెడ్ జోన్"గా ప్రకటించారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టించింది. గత నెలలో ఈ వ్యాధి కారణంగా 2,000కు పైగా కోళ్లు మరణించడంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కోళ్ల నుంచి మనుషులకు వ్యాధి వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్న అధికారులు, బర్డ్ ఫ్లూ వ్యాప్తి, లక్షణాలు, దాని ప్రభావం, తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక దంపతులైన లక్ష్మీదేవి, నాగన్న తమ పొలంలో పెంచడానికి హైదరాబాద్ నుంచి 2,500 నాటు కోళ్లను తెచ్చారు. గత నెల 28న ఒక్క రోజులోనే 2,000 కోళ్లు చనిపోగా, మిగిలినవి ఆ తర్వాత మరణించాయి.ఒక కిలోమీటర్ వరకు రెడ్ జోన్ : పశుసంవర్ధక శాఖ అధికారులు రత్నకుమార్ గోవిందరాజులు గ్రామాన్ని సందర్శించి కోళ్లను పరిశీలించి, నమూనాలను భోపాల్‌లోని ప్రయోగశాలకు పంపారు. ఆదివారం అందిన నివేదికలో ఈ మరణాలకు బర్డ్ ఫ్లూ కారణమని నిర్ధారణ అయింది. దీనికి స్పందనగా, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ (జీఐ) ప్రేమ్‌చంద్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆ ప్రాంతం చుట్టూ ఒక కిలోమీటర్ పరిధిని "రెడ్ జోన్"గా ప్రకటించారు. కోళ్లను నిర్మూలించి గుంతలలో పూడ్చిపెట్టేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులకు అప్పగించాలని స్థానికులకు సూచించారు.తరలించడాన్ని పూర్తిగ నిషేధించిన అధికారులు కోళ్లను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. గ్రామంలోకి కోళ్లు, గుడ్లు, కోళ్ల దాణా రవాణా చేయడాన్ని అలాగే వాటిని బయటి ప్రాంతాలకు తరలించడాన్ని పూర్తిగా నిషేధించారు. పొడి దగ్గు, జలుబు లేదా తుమ్ములు తరచుగా వస్తుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని వారు సూచించారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీవో సోలమన్ రాజు, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.వైరస్‌లో ఉపరకం బర్డ్ ఫ్లూ అనేది ఇన్ఫ్లుయెంజా వైరస్ ఉపరకం. ఇది పక్షులు, క్షీరదాలను ప్రభావితం




చేస్తుంది. అరుదుగా మానవులకు సోకుతుంది. వ్యాధి సోకిన పక్షులు లేదా ఇతర జంతువులతో సన్నిహితంగా ఉండటం ద్వారా, అలాగే కలుషితమైన పరిసరాల ద్వారా మానవులకు ఇది వ్యాపించే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన కోళ్లను తాకడం ద్వారా లేదా అనారోగ్యంతో ఉన్న కోళ్లను తినడం ద్వారా మానవులకు బర్డ్ ఫ్లూ సోకవచ్చు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ వైరస్ పక్షుల నుంచి మానవులకు శ్వాసకోశ మార్గం, జీర్ణకోశ మార్గం, కంజంక్టివా (కంటి పొరలు) ద్వారా వ్యాపిస్తుందని పేర్కొన్నారు.

# దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ ఇళ్లు ఏపీలో సరికొత్త గృహ నిర్మాణ శకం

తొలిసారిగా అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో నిర్మించే ఇళ్లకు గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం వేదికగా నిలిచింది. ఈ ఇళ్ల నిర్మాణానికి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. తక్కువ ఖర్చు, ఎక్కువ మన్నిక, ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా తట్టుకునే సామర్థ్యంతో గృహ నిర్మాణ రంగంలో ఏపీ సరికొత్త అధ్యాయానికి తెరతీసింది. దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో నిర్మించే ఇళ్లకు గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం వేదికగా నిలిచింది. ఈ నూతన సాంకేతికతతో చేపడుతున్న ఇళ్ల నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నమూనా ప్రదర్శనను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులతో కలిసి వారు పరిశీలించారు.పరిశ్రమల్లో 20 ఏళ్లుగా 3డీ ప్రింటింగ్ ఉపయోగిస్తున్నప్పటికీ గృహ నిర్మాణంలోకి తీసుకురావడం దేశంలోనే ఇదే తొలిసారి అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఇనుప కడ్డీలను వినియోగించరు. దీనివల్ల ఇనుము తుప్పు పడుతుందనే సమస్యే ఉత్పన్నం కాదని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) చీఫ్ సైంటిస్ట్ అజయ్ చౌరాసియా వివరించారు. కేవలం 20 శాతం సిమెంట్, 70 శాతం ఫ్లైయాష్, 0.1 శాతం పీపీ ఫైబర్‌తో పాటు విస్కాసిటీ మోడిఫైయింగ్ ఏజెంట్, సూపర్ ప్లాస్టిసైజర్ వంటి రసాయనాలను ఇందులో వినియోగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఇళ్లకు 80 నుంచి 90 ఏళ్ల పాటు మన్నిక ఉంటుందని, భూకంపాలు, వరదల్లాంటి ప్రకృతి విపత్తులను సైతం తట్టుకుంటాయని



వివరించారు.ఏసీ లేకుండానే చల్లదనం : ఈ అత్యాధునిక సాంకేతికతతో 100 ఇళ్లను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. దీనికి సీబీఆర్ఐ సైంటిస్ట్ అజయ్ బదులిస్తూ కేవలం 3 నెలల్లోనే 100 గృహాలను సిద్ధం చేయవచ్చని తెలిపారు. సగటున ఒక్కో ఇంటి నిర్మాణానికి కేవలం 10 రోజులు మాత్రమే పడుతుందన్నారు. సాధారణ ఇళ్లతో పోలిస్తే 20 నుంచి 30 శాతం వరకు ఖర్చు ఆదా అవుతుందని వివరించారు. 3డీ విధానంలో గోడలను పొరలు పొరలుగా నిర్మిస్తారు. ఈ పొరల మధ్య ఉండే ఖాళీల్లో మట్టిని నింపడం వల్ల వేడిని సులభంగా నియంత్రించవచ్చు. ఏసీలు, కరెంటు వాడకం లేకుండానే బయటి వాతావరణం కంటే లోపల 8 డిగ్రీల సెల్సియస్ తక్కువ ఉష్ణోగ్రత ఉంటుందని అధికారులు తెలిపారు. గోడల్లో తేమ, సీపేజ్ ఇబ్బందులు అస్సలు ఉండవు. ఖాళీల గుండా ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వైర్లను సులభంగా అమర్చుకోవచ్చు. 2 అంతస్తులు నిర్మించుకునేలా పునాది కూడా పటిష్ఠంగా ఉంటుంది.ఇళ్లు నిర్మించే చిన్న 3డీ ప్రింటింగ్ యంత్రం ధర రూ.50 లక్షలు కాగా, పెద్ద యంత్రం ధర రూ.1.40 కోట్లు ఉంటుంది. వీటి కాలపరిమితి మూడేళ్లు. ఒక్కో యంత్రంతో 3 వేల ఇళ్లను నిర్మించవచ్చు. యంత్రం, నిర్మాణ వ్యయాలను కలిపితే ఒక్కో ఇంటి సూపర్ స్ట్రక్చర్‌కు సుమారు రూ.2.50 లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ కొత్త విధానం వాణిజ్యపరంగా సక్సెస్ అయితేనే భారీ ఎత్తున విస్తరించగలమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెంలో చేపట్టిన 177 ఇళ్లను ముందుగా మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత పది యంత్రాలను కొనుగోలు చేసి 5 వేల ఇళ్లను నిర్మిద్దామని దిశానిర్దేశం చేశారు. ఈ భారీ ప్రాజెక్టులో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేసి, వారికి ప్రత్యేక శిక్షణ అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. డ్వాక్రా సంఘాల ద్వారా యంత్రాలను కొనుగోలు చేయించి వారికి స్థిరమైన ఆదాయం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.'సీఎం స్ఫూర్తితోనే ఐఏఎస్ అయ్యా': ఎన్టీఆర్ హయాం నుంచి 2014-19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు పేదల గృహనిర్మాణంలో తీసుకొచ్చిన వినూత్న సంస్కరణలను గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సిబారాణి ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వివరించారు. ఇదే క్రమంలో సీఎం చంద్రబాబు ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "హెప్సిబారాణి తండ్రి ఒకప్పుడు నా హయాంలో గృహనిర్మాణ శాఖలో ఏఈగా పనిచేశారు. ఇప్పుడు ఆమె అదే శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు" అని తెలిపారు. దీనికి హెప్సిబారాణి స్పందిస్తూ, "నా చిన్నతనంలో సీఎంగా చంద్రబాబు గారు మా ఇంటికి వచ్చారు. ఆ రోజు ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే నేను ఐఏఎస్ అధికారిని అయ్యాను. రాష్ట్రంలో సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఇక్కడికి వచ్చాను" అని వివరించారు.

# తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ!

డిసెంబర్ 11న గచ్చిబౌలి మైదానంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం, 22న ఎల్‌బీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ముగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యే అవకాశాలున్నాయని అధికారవర్గాల సమాచారం. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (కేఐవైజీ) 8వ ఎడిషన్ నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. మొత్తం 27 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించడానికి హైదరాబాద్, హనుమకొండ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం నగరాల్లో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. దేశం నలుమూలల నుంచి వచ్చే 7,500 మందికి పైగా క్రీడాకారులకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. వీరితో పాటు మరో 1,500 మంది సహాయక సిబ్బంది, 1000 మంది టెక్నికల్ అధికారులు రానున్నారు. డిసెంబరు 11 నుంచి 22 వరకు ఈ కేఐవై గేమ్స్ జరగనున్నాయి.11న గచ్చిబౌలి మైదానంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల సమాచారం. 22న ఎల్బీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ముగింపు కార్యక్రమాలను చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్పోర్ట్స్ పాలసీకి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ క్రీడలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా ప్లాన్ చేస్తోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయనున్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా హుస్సేన్‌సాగర్ వాటర్ స్పోర్ట్స్

ఖేలో ఇండియా గేమ్స్‌లో భాగంగా హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించే వాటర్ స్పోర్ట్స్ ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక్కడ కయాకింగ్, రోయింగ్, కానోయింగ్ వంటి విభాగాలను నిర్వహించనున్నారు. గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో వివిధ జిల్లాల్లో ఒక్కో క్రీడను నిర్వహించడానికి ఆయా జిల్లాలను ఎంపిక చేశారు. హనుమకొండలో అథ్లెటిక్స్, మహబూబ్‌నగర్‌లో కబడ్డీ, నిజామాబాద్‌లో టేబుల్ టెన్నిస్, కరీంనగర్‌లో జూడో, ఖమ్మంలో ఆర్చరీ పోటీలను నిర్వహిస్తారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, సరూర్‌నగర్, జేఎన్టీయూ, సికింద్రాబాద్ ఇండోర్, ఎల్బీనగర్, యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియాల్లో మిగతా క్రీడలను నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

## 5 కమిటీల ఏర్పాటు

ఈ క్రీడలను ఘనంగా నిర్వహించడానికి ఐదు రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేయగా, అందులో ఆర్గనైజింగ్ కమిటీకి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కో ఛైర్మన్‌గా కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఉన్నారు. క్రీడాకారులు, అతిథుల వసతి, భోజనం, రవాణా తదితర ఏర్పాట్ల కోసం ప్రత్యేక ఉన్నత స్థాయి కమిటీని అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్రం నిర్వహిస్తున్న ఈ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా 2024, 2025లో మహారాష్ట్ర అత్యధిక స్వర్ణాలు గెలిచి విజేతగా నిలిచింది. ఈ ఏడాది నిర్వహణకు కేంద్ర యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ తెలంగాణకు ప్రాధాన్యం ఇచ్చింది. వీటి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్ల నిధులను కేటాయించింది.

## ప్రధాన క్రీడలు

బాక్సింగ్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, జూడో, ఖో-ఖో, కబడ్డీ, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్

## సంప్రదాయ క్రీడలు

గట్కా, థాంగ్-టా, యోగాసన, మల్లఖంబ్, కలరియపట్టు తెలంగాణ ఆతిథ్య క్రీడ రోయింగ్ ప్రదర్శన క్రీడ సెయిలింగ్ ఎడిషన్ క్రీడ సాఫ్ట్‌బాల్.

# హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం.. 9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తుది హెచ్చరిక
- అక్టోబరు 9 లోగా లక్ష రూపాయలు చెల్లించాలని ఆదేశం
- గడువు దాటితే ప్రొవిజనల్ అలాట్‌మెంట్ రద్దు చేస్తామని స్పష్టీకరణ
- ఇప్పటికే 59 శాతం మంది లబ్ధిదారుల చెల్లింపులు పూర్తి
- ఖాళీ అయ్యే ఇళ్లు వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికి కేటాయింపు



హైదరాబాద్ నగరంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సిన లక్ష రూపాయల మొత్తానికి అక్టోబరు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా డబ్బు చెల్లించని వారి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ లెటర్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేస్తామని స్పష్టం చేసింది.తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 5,501 మందికి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, ఇప్పటివరకు 3,271 మంది (దాదాపు 59.46 శాతం) మాత్రమే తమ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే స్పందించి, గడువులోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు పూర్తి చేయాలని ఆయన కోరారు.అక్టోబరు 9 తర్వాత గడువును పొడిగించే ప్రసక్తే లేదని కమిషనర్ గౌతమ్ తేల్చిచెప్పారు. గడువులోగా చెల్లించడంలో విఫలమైన వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ ఖాళీలను వెయిటింగ్ లిస్టులో ఉన్న సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయిస్తామన్నారు. రాబోయే నెలల్లో లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు.అయితే, ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాలని చెబుతుండటంతో, ఆ పద్ధతి తెలియని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకం, కేటాయింపు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ం+ఎడీ.వశ్రీఖఅస్త్రుఖఱ.ప్రశీజ.ఇఅను సందర్శించాలని లేదా హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ 040-24603572లో సంప్రదించాలని అధికారులు సూచించారు. కేటాయింపుదారులకు వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు వాట్సాప్ ద్వారా కూడా సమాచారం పంపుతున్నట్లు వారు తెలిపారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం మహబూబాబాద్ జిల్లాకు చెందిన వివాహిత మృతి



అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రానికి చెందిన మహిళ సుప్రియ(30) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆమె ప్రయాణిస్తున్న కారును వెనక నుంచి ట్రక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆ కుటుంబం కొన్నేళ్లుగా సంతోషంగా కనిపించేది. ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె సుప్రియను కష్టపడి ఇంజినీరింగ్ చదివించారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న యువకుడితో వివాహం చేశారు. మనవడు పుట్టాక తరచూ కుమార్తె, మనవడితో వీడియోకాల్‌లో మాట్లాడేవారు. ఇంతలోనే ఆ కుటుంబం ఊహించని విషాదాన్ని చూసింది.అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన మహిళ సుప్రియ(30) మృతి చెందారు. తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన ప్రకారం మరిపెడ బంగ్లా మండల కేంద్రానికి చెందిన దారం శ్రీనివాస రావు గత నాలుగు సంవత్సరాల నుంచి ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలోని సింహాద్రినగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలుండగా మొదటి సంతానం సుప్రియను మహబూబాబాద్‌కు చెందిన కొదుమూరు రంజిత్‌కు ఇచ్చి వివాహం చేశారు. రంజిత్ సాఫ్టావేర్ ఉద్యోగం చేస్తున్నారు. 2022 నుంచి ఈ దంపతులు అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో నివసిస్తున్నారు. వీరికి మూడేళ్లున్న కుమారుడున్నాడు.

## రెస్టారెంట్ నుంచి కారులో ఇంటికి

రంజిత్ ఉద్యోగం చేస్తుండగా సుప్రియ ఓ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున సుప్రియ స్నేహితురాలితో కలిసి రెస్టారెంట్ నుంచి ఇంటికి కారులో బయల్దేరారు. ఇంతలోనే వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్ వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుప్రియ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె స్నేహితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. సుప్రియ అత్తమామలు కొదుమూరి వెంకటేశ్వర్లు, రాధిక మహబూబాబాద్ పట్టణంలోని ఓ కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్నారు. మృతదేహాన్ని స్వస్థలం మరిపెడ బంగ్లా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు

సుప్రియ మరణ వార్తను ఆమె తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ బంధుమిత్రులు చాలా మంది మరిపెడలోనే ఉండడంతో విషాదం అలుముకుంది. కుమార్తెతో నిత్యం ఫోన్‌లో మాట్లాడిన మాటలు, మనవడి ముద్దు ముచ్చట్లు గుర్తు చేసుకుంటూ సుప్రియ తల్లి కన్నీరుమున్నీరవుతున్నారు. దారం శ్రీనివాస్ సొంత గ్రామం మరిపెడ అయినప్పటికీ ప్రస్తుతం ఖమ్మం పట్టణంలో నివాసం ఉంటున్నారు. కిరాణా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే శ్రీనివాస్ దంపతులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడ్డారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో షియర్‌జోన్ దాటిన తవ్వకాలు 2028 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన టన్నెల్‌లో ఇప్పటి వరకు 79 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. ఎస్-ఎల్‌బీసీ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు పడిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రమాదకరమైన షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గత ఐదు నుంచి ఆరు నెలల్లో సుమారు 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ పనులపై అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. 43.968 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్‌లో ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తికాగా మరో 9.1 కిలోమీటర్ల తవ్వకాలు మిగిలి ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో వేగం పెంచాలి

ప్రస్తుతం రోజుకు 7 నుంచి 7.5 మీటర్ల మేర పనులు జరుగుతున్నాయని, అదనపు డ్రిల్లింగ్ బూమర్, ఎలక్ట్రిక్ లోడర్లు, ఆధునిక ఎక్స్‌కవేటర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. జర్మనీ నుంచి అక్టోబర్ చివరికి లోకోమోటివ్ రానుందని, దీంతో టన్నెల్‌లో తవ్విన మట్టిని వేగంగా బయటకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో 48 గంటలు పట్టిన నిర్మాణ సైకిల్ ప్రస్తుతం 20--24 గంటలకు తగ్గిందని, దాన్ని సుమారు 10 గంటలకు తగ్గించి పనుల వేగం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మే--జూన్ 2028 నాటికి టన్నెల్-1 బ్రేక్‌త్రూ పూర్తి చేసి జూన్ 2028 నాటికి నీటిని అందించేలా పనులు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పనులు కొనసాగించాలని సూచించారు.

## ప్రత్యేక బృందంతో పర్యవేక్షణ

ఎస్ఎల్బీసీ సొరంగం పనులు మళ్లీ వేగం పుంజుకుంటున్నాయి. గతంలో జరిగిన ప్రమాదం అనంతరం కొంతకాలం నిలిచిపోయిన పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం తిరిగి ప్రారంభించింది. టన్నెల్ పనులను పూర్తి చేయడంలో వేగంతో పాటు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.సైన్యంలో సొరంగాల నిర్మాణంలో పనిచేసిన నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా వీటిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. సొరంగం పనులు వేగవంతం చేసేందుకు అత్యాధునిక త్రీఆర్మ్ బూమర్ యంత్రాన్ని రంగంలోకి దించారు. జపాన్ నుంచి సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ యంత్రంను తీసుకొచ్చారు. ఇప్పటివరకు సొరంగం ఎగువ, దిగువ భాగాల్లో వేర్వేరుగా తవ్వకాలు చేపట్టాల్సి వచ్చేది. త్రీఆర్మ్ బూమర్ అందుబాటులోకి రావడంతో ఒకేసారి పూర్తి భాగాన్ని తవ్వే అవకాశం ఏర్పడింది. సుమారు 10 మీటర్ల వ్యాసంతో సొరంగం తవ్వే సామర్థ్యం ఈ త్రీఆర్మ్ బూమర్ యంత్రానికి ఉంది.

# రామాయపట్నం రిఫైనరీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్



ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు కీలక అడుగు పడింది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ) పచ్చజెండా ఊపుతూ సిఫారసు చేసింది. ఈ అనుమతితో ప్రాజెక్టు నిర్మాణ పనుల ప్రారంభానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.సుమారు రూ.1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రామాయపట్నం పోర్టు సమీపంలో దాదాపు 5,200 ఎకరాల భూమిని కేటాయించారు. ఏడాదికి 9 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) ఉత్పత్తి సామర్థ్యంతో దీనిని నిర్మిస్తారు. ఇందులో 5.4 మిలియన్ టన్నుల పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ వంటి రవాణా ఇంధనాలతో పాటు, 3.2 మిలియన్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేయాలన్నది లక్ష్యం.పర్యావరణ పరిరక్షణకు ఈ ప్రాజెక్టులో పెద్దపీట వేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు ప్రాంగణంలో 30 శాతం, అంటే సుమారు 1,563 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనాన్ని (గ్రీన్ బెల్ట్) అభివృద్ధి చేయనున్నారు. పర్యావరణ నిర్వహణ ప్రణాళిక కోసం ప్రత్యేకంగా రూ.3,022 కోట్లు కేటాయించడం గమనార్హం. వీటితో పాటు గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన జోన్లు, రామాయపట్నం పోర్టుతో అనుసంధానించిన మెరైన్ క్రూడ్ ఆయిల్ టెర్మినల్ కూడా ఈ ప్రాజెక్టులో భాగం కానున్నాయి.ఈ రిఫైనరీ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారనున్నాయని, దక్షిణ భారతదేశంలోనే ఇది ఒక ప్రధాన ఇంధన, పెట్రోకెమికల్ హబ్‌గా ఎదుగుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో వేలాది మందికి, ఆ తర్వాత నిర్వహణ దశలోనూ వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. అనుమతుల ప్రక్రియ ఖరారైన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు బీపీసీఎల్ సన్నాహాలు చేస్తోంది.

# పేదలకు గుడ్‌న్యూస్.. ఏపీలో 3 లక్షల ఇళ్లు.. రూ. 3,600 కోట్ల భారీ హౌసింగ్ ప్రాజెక్ట్ ప్రారంభం..



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదల గృహనిర్మాణ రంగాన్ని సరికొత్త పుంతలు తొక్కిస్తూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతమైన పురోగతి వైపు అడుగులు వేస్తోంది. గుంటూరు జిల్లా తెనాలి శాసనసభ నియోజకవర్గ పరిధిలోని బుర్రిపాలెం గ్రామంలో 3 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ఆదివారం ఘనంగా శంకుస్థాపన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో ఇళ్ల కొరతను నివారించడంతో పాటు సాంకేతిక రంగాన్ని గృహనిర్మాణానికి అనుసంధానించడంలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంకీర్ణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేయడమే ధ్యేయంగా పనిచేస్తోంది. గత రెండేళ్ల కాలంలోనే ప్రభుత్వం నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు విజయవంతంగా అందజేసింది. ఇందులో భాగంగా గత ఏడాది నవంబర్ నెలలో మొదటి విడత కింద 3 లక్షల ఇళ్లకు, ఈ ఏడాది మార్చి నెలలో రెండవ విడత కింద మరో 2.50 లక్షల ఇళ్లకు వైభవంగా సామూహిక గృహప్రవేశ వేడుకలను నిర్వహించారు. ఇక్కడితో ఆగకుండా, వచ్చే మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, లబ్ధిదారులకు తాళాలు అప్పగించే లక్ష్యంతో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులను ముందుకు తీసుకెళ్తోంది. రాష్ట్ర సొంత నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని గరిష్టంగా వినియోగించుకునేలా ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ 2.0 పథకం కింద రాష్ట్రానికి పెద్ద ఎత్తున ఇళ్లను సాధించేందుకు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపింది. ఈ సమర్థవంతమైన ప్రయత్నాల ఫలితంగా.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అదనంగా 3 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఈ నిధులు, ఇళ్ల కేటాయింపు గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరచడానికి దోహదపడనున్నాయి. గుంటూరు ట్రాఫిక్ కష్టాలకు చెక్.. రూ. 108 కోట్లతో ఫోర్-లేన్ ఓవర్ బ్రిడ్జ్ వచ్చేస్తోంది.. ఎక్కడి నుంచంటే.. ఈ పర్యటనలోని మరొక ప్రధాన ఆకర్షణ మరియు విప్లవాత్మక అడుగు '3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ'. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నాయి. భారతదేశంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్న ఈ అత్యాధునిక విధానం ద్వారా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం మరియు ఓబులనాయుడుపాలెం గ్రామాలలో సుమారు రూ. 14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. సాంప్రదాయ నిర్మాణ పద్ధతులతో పోలిస్తే 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా చాలా వేగంగా, తక్కువ సమయానికే నాణ్యమైన ఇళ్లను నిర్మించవచ్చు. ఇది నిర్మాణ వ్యర్థాలను తగ్గించడమే కాకుండా మానవ శ్రమ అవసరాలను పరిమితం చేస్తుంది. దృఢత్వం, మన్నిక విషయాల్లో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పుతుంది. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ మరియు రహదారుల నిర్మాణాన్ని కూడా ఈ లేఅవుట్లలో ప్రభుత్వం ప్రాధాన్యతగా చేపడుతోంది. ప్రతి పేద కుటుంబానికి సురక్షితమైన, స్థిరమైన మరియు ఆధునిక సదుపాయాలు కలిగిన ఇల్లు అందించడమే లక్ష్యంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాయి. ఈ నూతన ప్రాజెక్టులు మరియు సాంకేతిక ప్రయోగాలు ఏపీ గృహనిర్మాణ రంగానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తున్నాయి.ం

# వచ్చే వారం ఐదు రోజులే బ్యాంకులు ఓపెన్.. !




వచ్చే వారం బ్యాంక్ శాఖను సందర్శించాలని అనుకునే వినియోగదారులు ముందుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెలవుల జాబితాను పరిశీలించడం మంచిది. అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 11, 2026 మధ్య కాలంలో రెండవ శనివారం, మహాలయ అమావాస్య వంటి సందర్భాల్లో కొన్ని నగరాల్లోని బ్యాంక్ శాఖలు మూసివేయనున్నారు. సెలవు దినాల్లో భౌతిక బ్యాంక్ శాఖలు మూసి ఉన్నప్పటికీ, యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం వంటి డిజిటల్ బ్యాంకింగ్ సేవలు సాధారణంగా అందుబాటులో ఉంటాయి. నెలలో రెండవ శనివారం కావడంతో అక్టోబర్ 10 శనివారం నాడు భారతదేశం అంతటా బ్యాంక్ శాఖలు మూసివేస్తారు. సెలవుల క్యాలెండర్ ప్రకారం బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో మహాలయ అమావాస్య సందర్భంగా కూడా బ్యాంకులకు సెలవు ఉంటుంది. వారపు సెలవు దినం కావడంతో, అక్టోబర్ 11 ఆదివారం నాడు భారతదేశం అంతటా బ్యాంకులు మూసివేస్తారు. అక్టోబర్ 5 నుంచి 9 వరకు బ్యాంకులు తెరిచి ఉంటాయి. ప్రత్యేక స్థానిక సెలవు దినం ప్రకటించబడిన నగరాల్లో తప్ప, అక్టోబర్ 5 సోమవారం నుంచి అక్టోబర్ 9 శుక్రవారం వరకు బ్యాంక్ శాఖలు తెరిచి ఉంటాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ దారులకు అలర్ట్.. నేటి నుంచి మారనున్న ఎఫ్డీ రూల్స్..! బ్యాంక్ శాఖను సందర్శించాలనుకునే వినియోగదారులు తమ నగరానికి వర్తించే సెలవుల వివరాలను తనిఖీ చేసి, వెళ్లే ముందు సంబంధిత బ్యాంకును సంప్రదించి నిర్ధారించుకోవాలి. అక్టోబర్ 17న మహా సప్తమి సందర్భంగా అగర్తలలో బ్యాంకులు మూసివేయనున్నారు. అక్టోబర్ 19న దసరా/మహా నవమి/ఆయుధ పూజ/దుర్గా పూజ సందర్భంగా అగర్తల, ఐజ్వాల్, భువనేశ్వర్, చెన్నై, గౌహతి, ఇంఫాల్, ఇటానగర్, కోహిమా, కోల్‌కతా, పాట్నా, రాంచీ, షిల్లాంగ్ నగరాల్లో బ్యాంక్ శాఖలు పని చేయవు. అక్టోబర్ 20న దసరా/విజయ దశమి/మహానవమి సందర్భంగా గ్యాంగ్‌టక్, ఇంఫాల్ నగరాల్లో తప్ప, చాలా ప్రధాన నగరాల్లో బ్యాంకులు మూసివేయనున్నారు. అక్టోబర్ 21 విజయ దశమి/దుర్గా పూజ సందర్భంగా అగర్తలా, బెంగళూరు, గ్యాంగ్‌టక్, గౌహతి, కొచ్చి, కోల్‌కతా, తిరువనంతపురంలలోని బ్యాంక్ శాఖలు మూసివేస్తారు. అక్టోబర్ 22 ఄ 23న దుర్గా పూజ/దసైన్ గ్యాంగ్‌టక్‌లో బ్యాంకులు మూసివేయనున్నారు. అక్టోబర్ 26 లక్ష్మీ పూజ/యాక్సెషన్ డే/మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా అగర్తలా, చండీగఢ్, జమ్మూ, సిమ్లా, శ్రీనగర్‌లలోని బ్యాంక్ శాఖలు పని చేయవు. అక్టోబర్ 29న కార్వా చౌత్ సందర్భంగా సిమ్లాలో బ్యాంకులు మూసివేస్తారు. అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా అహ్మదాబాద్‌లో బ్యాంకులు మూసివేయబడతాయి. సదరు సెలవుదినం వర్తింపునకు సంబంధించి ఖచ్చితమైన వివరాల కోసం వినియోగదారులు తమ స్థానిక బ్యాంక్ శాఖలను సంప్రదించడం మంచిది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు. మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# పెరిగిన డీ మార్ట్ ఆదాయం.. కొత్తగా 3 స్టోర్లు ప్రారంభం..




డీ మార్ట్ రిటైల్ చైన్‌ను నిర్వహిస్తున్న ఎవెన్యూ సూపర్ మార్ట్స్ సెప్టెంబర్ 30, 2026తో ముగిసిన రెండవ త్రైమాసికానికి సంబంధించి తన కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయంలో (స్టాండ్‌అలోన్) 18.4% వార్షిక వృద్ధిని నమోదు చేసింది. ఆదాయం రూ.19,206.18 కోట్లకు చేరింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.16,218.79 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రాధాకిషన్ దమానీ నేతృత్వంలోని ఈ రిటైల్ సంస్థకు సెప్టెంబర్ 30 నాటికి మొత్తం 518 స్టోర్లు ఉన్నాయి. ఈ సంఖ్యలో మహారాష్ట్రలోని నవీ ముంబై, సంపడాలో ఉన్న అవుట్‌లెట్ కూడా ఉంది. అయితే పునర్నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఇది ప్రస్తుతం మూసివేశారు. జూన్ త్రైమాసికంలో నమోదైన రూ.18,343.49 కోట్ల ఆదాయంతో పోలిస్తే డీ మార్ట్ ఆదాయం 4.7% పెరిగింది. రాధాకిషన్ దమానీ, ఆయన కుటుంబం ప్రమోట్ చేసిన ఐ-మ్యీతీ, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, నేషనల్ క్యాపిటల్ రీజియన్ తమిళనాడు, పంజాబ్, రాజస్థాన్ వంటి అనేక రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. డీమార్ట్ నిత్యావసర గృహోపకరణాలు, వ్యక్తిగత వినియోగ ఉత్పత్తులను విక్రయిస్తుంది. ఎవెన్యూ సూపర్ మార్ట్స్ జూన్ త్రైమాసికానికి సంబంధించి తన ఏకీకృత నికర లాభంలో 11.3 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసి రూ.860.6 కోట్లకు చేర్చింది. చాశ్రీంశీ =ఘు రూ. 4.39 లక్షల నుంచి రూ. 2.25 లక్షలకు పడిపోయిన వెండి ధర.. కొనుగోలుపై నిపుణులు కీలక సూచన.. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఈ లాభం రూ.773 కోట్లుగా ఉంది. జూన్ 30, 2026తో ముగిసిన త్రైమాసికానికి కంపెనీ మొత్తం ఆదాయం, గత ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.16,360 కోట్ల నుంచి రూ.18,795 కోట్లకు పెరిగింది. ఎబిట్డా (వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు ఆదాయం) ఏడాది క్రితం ఉన్న రూ.1,299 కోట్ల నుంచి 15.4 శాతం పెరిగి రూ.1,499 కోట్లకు చేరింది. 26లో 7.9 శాతంగా ఉన్న ఎబిట్డా మార్జిన్, 27లో స్వల్పంగా మెరుగుపడి 8 శాతానికి చేరింది. ఈ త్రైమాసికంలో మూడు కొత్త స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 503కి చేరింది. 27లో కంపెనీ మార్జిన్ 4.6%గా నమోదైంది. ఇది అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలోని 4.7%తో పోలిస్తే స్వల్పంగా తక్కువ. ఎవెన్యూ సూపర్ మార్ట్స్ షేర్ ధర వివిధ కాల వ్యవధులలో మిశ్రమ పనితీరును కనబరిచింది. గత వారంలో ఈ స్టాక్ 0.61 శాతం, గత నెలలో 0.12% వృద్ధిని సాధించింది. ఈ ఏడాది ప్రారంభం నుండి చూస్తే, షేర్లు 2.48% పెరిగాయి. అయితే మూడు నెలల కాలంలో 12.07%, ఆరు నెలల కాలంలో 10.81% క్షీణతను నమోదు చేసింది. స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయినప్పటి నుండి ఇది 518.46% మేర భారీ (మల్టీబ్యాగర్) రాబడిని అందించింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు. మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఉద్యోగి జీతంలో అదనంగా కట్ అయ్యే జీతాన్ని కంపెనీలే చెల్లించాలి..!




సెప్టెంబర్ 17న ప్రభుత్వం జూఖీూ వేతన పరిమితిని రూ. 15,000 నుంచి రూ. 25,000కు పెంచింది. ఈ సవరణ ద్వారా అదనంగా 10 మిలియన్లకు పైగా కార్మికులకు తప్పనిసరి కవరేజీని విస్తరించనుంది. ఈపీఎఫ్ఓ వేతన పరిమితిని రూ. 25,000కు పెంచిన నేపథ్యంలో, ఉద్యోగుల చట్టబద్ధమైన వేతనాలను తగ్గించవద్దని కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ యజమానులను ఆదేశించింది. ఉద్యోగుల సంతృప్తిని, నిలుపుదలను మెరుగుపరచడంలో సహాయపడే మంచి మానవ వనరుల పద్ధతులలో పెట్టుబడిగా, తమ సామాజిక భద్రతా వాటాలను పరిగణించాలని కూడా మంత్రిత్వ శాఖ యజమానులను కోరింది. యజమానులు తమ చట్టబద్ధమైన వాటాలను సరిగ్గా చెల్లించేలా చూసుకోవాలని, అలాగే వర్తించే చట్టానికి విరుద్ధంగా ఉద్యోగుల చట్టబద్ధమైన వేతనాలను తగ్గించకుండా చూసుకోవాలని మంత్రిత్వ శాఖ తెలిపింది. సవరించిన వేతన పరిమితి వల్ల యజమానుల ఖర్చులు అనివార్యంగా పెరుగుతాయని మంత్రిత్వ శాఖ అంగీకరించింది. "ప్రధాన మంత్రి విక్సిత్ భారత్ రోజ్‌గార్ యోజన కింద ప్రతి ఉద్యోగికి నెలకు రూ. 3,000 వరకు ప్రోత్సాహకం అందించడం ద్వారా యజమానులు ఈ అదనపు ఆర్థిక భారాన్ని పాక్షికంగా భర్తీ చేసుకోవచ్చు" అని అది తెలిపింది. అంతేకాకుండా ఎక్కువ మంది కార్మికులను అధికారిక ఉపాధి వ్యవస్థలోకి తీసుకురావడం, పెట్టుబడులకు గమ్యస్థానంగా భారతదేశ స్థానాన్ని కూడా బలపరుస్తుందని చెప్పింది. బ్రేకింగ్ న్యూస్.. సెప్టెంబర్‌లో ఉద్యోగుల జీతాలు తగ్గే అవకాశం..! సవరించిన వేతన పరిమితి వల్ల ఉద్యోగుల చేతికి అందే జీతం (టేక్-హోమ్ పే) తగ్గవచ్చనే ఆందోళనలను పరిష్కరిస్తూ, కు కార్మికులు అందించే అదనపు మొత్తంపై స్థిరంగా అధిక వడ్డీ లభిస్తుందని, పన్ను ప్రయోజనాలకు అర్హత పొందుతుందని, అలాగే ఉచిత బీమా కవరేజీతో పాటు హామీతో కూడిన పెన్షన్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సహాయపడుతుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కోసం ఇది ఒక చిన్న త్యాగం అని దీనిని అభివర్ణించారు. ఈ మార్పు వల్ల ప్రభావితమయ్యే ఉద్యోగుల వివరాలను వెంటనే పరిశీలించడం ప్రారంభించాలని మంత్రిత్వ శాఖ యజమానులను కోరింది. రూ. 15,000 కంటే ఎక్కువ, రూ. 25,000 కంటే తక్కువ జీతం పొందే ఉద్యోగులను 'ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్' పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేసింది.

# ప్రయోగాలకు ఇక టైమ్ లేదు.. ప్రపంచకప్ జట్టుపై గిల్ కీలక ప్రకటన!




వన్డే ప్రపంచకప్‌కు ఏడాది మాత్రమే సమయం ఉండటంతో ఇక ప్రయోగాలకు స్వస్తి పలకాలని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భావిస్తున్నాడు. వచ్చే సిరీస్ నుంచే ప్రపంచకప్‌లో ఆడించాలనుకుంటున్న జట్టుతో బరిలోకి దిగాలని స్పష్టం చేశాడు. ఆటగాళ్ల గాయాలు, ఇతర టోర్నీల షెడ్యూల్ కారణంగా పూర్తి స్థాయి జట్టుతో ఆడలేకపోయామని తెలిపాడు. అయితే ఈ పరిస్థితి కొత్త ఆటగాళ్లకు తమ సత్తా నిరూపించుకునే మంచి అవకాశాన్ని ఇచ్చిందని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో కైవసం చేసుకుంది. అయితే చివరి వన్డేలో ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఆసియా క్రీడల్లో స్వర్ణం నిలబెట్టుకునేందుకు భారత్ పూర్తి స్థాయి టీ20 జట్టును పంపడంతో పలువురు కీలక వన్డే ఆటగాళ్లు ఈ సిరీస్‌కు దూరమయ్యారు. జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆసియా క్రీడల్లో పాల్గొన్నారు. హార్దిక్ పాండ్యా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా గాయాలతో అందుబాటులో లేకపోయారు. దీంతో రుతురాజ్ గైక్వాడ్, నమన్ ధీర్, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీ వంటి ఆటగాళ్లకు అవకాశాలు దక్కాయి. నితీశ్ కుమార్ రెడ్డి, గుర్నూర్ బ్రార్ వంటి యువ ఆటగాళ్లను కూడా ప్రపంచకప్ కోసం సిద్ధం చేస్తున్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని గిల్ సూచించాడు. అయితే ఇకపై ప్రయోగాలకు ఎక్కువ సమయం లేదని గిల్ స్పష్టం చేశాడు. వచ్చే న్యూజిలాండ్ పర్యటన నుంచి అందుబాటులో ఉన్న ప్రధాన ఆటగాళ్లతోనే బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ఆ పర్యటనలో ఐదు వన్డేలు, ఐదు టీ20లు, రెండు టెస్టులు జరగనున్నాయి. ప్రపంచకప్‌లో ఆడించే జట్టును ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. వెస్టిండీస్ సిరీస్‌లో అరంగేట్రం చేసిన అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీలకు గిల్ మద్దతుగా నిలిచాడు. పరుగులు సమర్పించుకున్నప్పటికీ వారిద్దరికీ భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వస్తాయని చెప్పాడు. అన్షుల్ ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేయగలగడం జట్టుకు కీలకమని అభిప్రాయపడ్డాడు.

# నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా దాన్ని అందుకోవాలి గవాస్కర్




వెస్టిండీస్ తో చివరి వన్డేలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుత ఫామ్‌తో 92 పరుగులు చేసినప్పటికీ, భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశాడు. సెంచరీకి కేవలం 8 పరుగుల దూరంలో రోహిత్ ఔట్ కావడం తనను నిరాశపరిచిందని అన్నాడు. రోహిత్ శర్మ తన కెరీర్‌ను ఓ ప్రత్యేకమైన మైలురాయితో ముగించాలని తాను కోరుకుంటున్నట్లు గవాస్కర్ ఒక ఆసక్తికర లక్ష్యాన్ని నిర్దేశించాడు. జియోస్టార్‌లో ప్రసారమైన 'హయర్ క్రికెట్ లైవ్' కార్యక్రమంలో గవాస్కర్ మాట్లాడుతూ.. "2027 వన్డే ప్రపంచకప్ తర్వాత సుమారు 40 ఏళ్ల వయసులో రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. నా వ్యక్తిగత కోరిక ఏంటంటే.. అతను రిటైర్ అయ్యే నాటికి అతని వయసు కన్నా ఎక్కువ వన్డే సెంచరీలు చేయాలి. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 35 సెంచరీలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో శతకం పూర్తి చేసి ఉంటే, ఆ సంఖ్య 36కు చేరేది. తద్వారా 40 సెంచరీల మార్క్‌కు మరింత దగ్గరయ్యేవాడు" అని అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా తన కెరీర్‌లోని చివరి దశను గవాస్కర్ గుర్తుచేసుకున్నాడు. "నాకు 38 ఏళ్ల వయసులో, టెస్టుల్లో 38 సెంచరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ దురదృష్టవశాత్తు మూడుసార్లు 90ల్లో ఔటయ్యాను. అందుకే రోహిత్ సెంచరీ మిస్ కావడం చూసి నిరాశ చెందాను. నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా ఆ ఘనత అందుకోవాలి" అని అభిలషించాడు. అదే సమయంలో 2023 ప్రపంచకప్ తర్వాత రోహిత్ బ్యాటింగ్ శైలిలో మార్పు వచ్చిందని గవాస్కర్ విశ్లేషించాడు. "ప్రపంచకప్‌లో మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడేవాడు. ఇప్పుడు తన వికెట్‌కు ఎక్కువ విలువ ఇస్తున్నాడు. ఇది మంచి పరిణామమే. అయినా, రోహిత్‌ను నేను 30-40 పరుగులు చేసే ఆటగాడిగా కాకుండా, 'సెంచరీల వీరుడు'గానే చూస్తాను" అని స్పష్టం చేశాడు.

# ఇరానీ కప్ రెస్టాఫ్ ఇండియా కైవసం.. ముఖేష్ కుమార్ దెబ్బకు జమ్మూ కశ్మీర్ చిత్తు



ఫాస్ట్ బౌలర్ ముఖేష్ కుమార్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో రెచ్చిపోవడంతో రెస్టాఫ్ ఇండియా జట్టు 31వ సారి ఇరానీ కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. షేర్-ఇ-కశ్మీర్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రంజీ ట్రోఫీ ఛాంపియన్ జమ్మూ కశ్మీర్‌ను 167 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. ఆదివారం, నాలుగో రోజు 279 పరుగుల లక్ష్య ఛేదనలో జమ్మూ కశ్మీర్ జట్టు పేకమేడలా కుప్పకూలింది. లంచ్ విరామానికి 89/3 స్కోరుతో పటిష్ఠంగానే కనిపించిన జమ్మూ కశ్మీర్, విరామం తర్వాత గంట వ్యవధిలోనే చేతులెత్తేసింది. ముఖ్యంగా ముఖేష్ కుమార్ తన అద్భుతమైన స్పెల్‌తో ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. కేవలం 33 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 11వ సారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఒకే ఓవర్‌లో నాలుగు బంతుల వ్యవధిలో మూడు వికెట్లు తీసి జమ్మూ కశ్మీర్ మిడిలార్డర్ వెన్ను విరిచాడు. అతనికి ఆకాశ్ దీప్ (3/25) చక్కటి సహకారం అందించాడు. మరో పేసర్ ముఖేష్ చౌదరి కీలకమైన అబ్దుల్ సమద్ వికెట్‌ను తీశాడు. దీంతో కశ్మీర్ జట్టు 28.4 ఓవర్లలో కేవలం 111 పరుగులకే ఆలౌటైంది. ఆ జట్టులో శుభమ్ ఖజురియా (36), కమ్రాన్ ఇక్బాల్ (32), అబ్దుల్ సమద్ (20) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. అంతకుముందు, రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 237 పరుగులు చేయగా, జమ్మూ కశ్మీర్ 278 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో స్మరణ్ రవిచంద్రన్ (135) అద్భుత సెంచరీతో రెస్టాఫ్ ఇండియా 319 పరుగులు చేసి తిరిగి పోటీలోకి వచ్చింది. స్మరణ్ తొలి ఇన్నింగ్స్‌లోనూ 68 పరుగులతో రాణించడంతో అతనికి "ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్" అవార్డు లభించింది. జ్వరంతో బాధపడుతున్న రెగ్యులర్ కెప్టెన్ రిషభ్ పంత్ డగౌట్‌కే పరిమితం కాగా, అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ కెప్టెన్‌గా జట్టును విజయపథంలో నడిపించాడు. పంత్ పుట్టినరోజున ఈ విజయం అతనికి మంచి బహుమతిగా నిలిచింది. కాగా, రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 20కి పైగా నో-బాల్స్ వేయడం జమ్మూ కశ్మీర్ ఓటమికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచింది.



# విశ్వక్‌సేన్ ‘కల్ట్’ విడుదల అప్పుడే

విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘కల్ట్’. తారక్ సినిమా పతాకంపై సందీప్ కాకరాల భారీ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో నిర్మించిన భారీసెట్‌లో వందలాది మోడల్స్‌తో 40-50 రోజుల పాటు జరిగిన కీలక సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేస్తున్నామని, ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా ‘కల్ట్’ విడుదల కానున్నదని మేకర్స్ చెప్పారు. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ ఇతరపాత్రధారులు. ఈచిత్రానికి మాటలు: తరుణ్‌భాస్కర్, సౌండ్ డిజైన్: ‘యానిమల్’ఫేం సచిన్.

# ఓ వైపు శాంతం మరోవైపు రౌద్రం

ప్రస్తుతం సాయిపల్లవికి మహర్దశ నడుస్తున్నది. ఒక కథానాయికగా దేశవ్యాప్తంగా తిరుగులేని గుర్తింపు రావడం అరుదైన విషయం. అన్ని భాషలకు చెందిన ప్రేక్షకులూ తమ హీరోయిన్‌గా ఓన్ చేసుకోవడం ఈ మధ్య సాయిపల్లవి విషయంలోనే జరిగిందని చెప్పక తప్పదు. వచ్చే నెలలో రెండు వారాల తేడాతో ఆమె సినిమాలు రాబోతున్నాయి. వాటిలో మొదటిది నితీష్ తివారీ ‘రామాయణ: పార్ట్ 1’. ఈ పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యంలో సాయిపల్లవి సీతామహాసాధ్విగా కనిపించనున్నారు. సరిగ్గా ఈ సినిమా విడుదలైన రెండు వారాలకు, అంటే.. నవంబర్ 20న ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ‘ఓం: చాప్టర్ 1’ విడుదల కానున్నది. ఇందులో సాయిపల్లవిది కీలకమైన పాత్ర. యాక్షన్, ఎమోషన్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని సమాచారం. రెండు వారాల గ్యాప్‌తో రెండు పొంతన లేని పాత్రల ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని సాయిపల్లవి పంచనున్నదని సినీవర్గాలు అంటున్నాయి. ఈ ప్రయత్నాలు రెండూ ఫలిస్తే.. సాయిపల్లవి క్రేజ్ దేశవ్యాప్తంగా మరింత పెరగడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# మట్టితో మమేకమైన కూలీ కథ

హీరో శర్వానంద్ నటిస్తున్న ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా ‘భోగి’. సంపత్‌నంది దర్శకుడు. కేకే రాధామోహన్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా ఈసినిమా టీజర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని అక్కడి నాగరికతనూ, పగలు, ప్రతీకారాలు, భక్తి, మూఢ విశ్వాసాల నేపథ్యంలో టీజర్ సాగింది. శర్వా రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో మట్టితో మమేకమైన ఓ సాధారణ కూలీగా కనిపించారు. అనుపమ పరమేశ్వరన్ పాత్ర కూడా సీరియస్ మోడ్‌లో ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నది. 1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథను దర్శకుడు సంపత్‌నంది ఎంతో సహజంగా, నేటివిటితో తెరకెక్కిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది. రా, ఇంటెన్స్, రూటెడ్ ప్రపంచాన్ని టీజర్ ఆవిష్కరించింది. డింపుల్ హయాతీ మరో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిశోర్‌కుమార్ అరోకియా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.






# ‘చకోర’ ఓ అమ్మ చెప్పిన కథ

శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగా నటించిన చిత్రం ‘చకోర -- లూనార్ లవ్ బర్డ్’. మంగా శ్రీనివాస్ దర్శకుడు. చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబర్ 9న సినిమా థియేట్రికల్ రిలీజ్ కానున్నది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ‘ఇదొక అమ్మ చెప్పిన ప్రేమకథ. కేవలం వర్షపునీళ్లతోనే దాహం తీర్చుకునే విశిష్టమైన పక్షి చకోర. ఆ పక్షిలాగే మనం కూడా స్వచ్ఛమైన పేమ కోసమే వేచి చూడాలని, అలాగే.. చకోర పక్షికి జాబిల్లిని చేరాలని కోరిక. దాని కోసం అలుపెరగకుండా ప్రయాణిస్తుంది. ఆ ప్రయత్నంలోనే మరణిస్తుంది. మనం కూడా చకోర పక్షిలా లక్ష్యాన్ని చేరుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించాలని ఈ సినిమా ద్వారా చెబుతున్నాం’ అని దర్శకుడు మంగా శ్రీనివాస్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు శ్రవణ్, మలైకా ఆనందం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందం అంతా మాట్లాడారు.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040